
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
నల్లగొండ
5
శనివారం 15 నవంబరు 2025



గరిష్ఠం 28.0
కనిష్ఠం 17.4

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587 (305.5050)	14,934	14,934
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.15 (4.36)	1,642.81	2,493.07
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.226 (43.0610)	10,544	8,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

బియ్యం ఇస్తున్నా.. సంచులు ఇస్తలేరు



రేషన్ దుకాణాల ద్వారా పంపిణీచేస్తున్న సన్న బియ్యాన్ని సంచుల్లో ఇవ్వాల్సి ఉండగా, లబ్ధిదారులకు అవి పూర్తిస్థాయిలో అందడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఇక్కడ రేషన్ ఇస్తున్నా సంచులు ఇవ్వడం లేదు. అదే విధంగా 6కిలోలకు ఒక సంచి చొప్పున ఇవ్వాల్సి ఉండగా, కుటుంబానికి ఒకటి చొప్పున డీలర్లు పంపిణీచేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ టౌన్)



- లబ్ధిదారులకు అందని బ్యాగులు
- కోటా మేరకే అంటున్న డీలర్లు
- కుటుంబానికి ఒక్కటే ఇస్తున్న వైనం

ప్రజా పంపిణీ కేంద్రాల ద్వారా అందించే బియ్యం సరఫరాలో నూతన విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం దొడ్డుబియ్యానికి బదులు సన్నబియ్యాన్ని ఇస్తోంది. పౌరసరఫరాలశాఖ జూన్ మాసంలోనే మూడు నెలలు (జూన్, జూలై, ఆగస్టు) కోటాను ఒకేసారి లబ్ధిదారులకు అందించింది. ఆ తదుపరి దరఖాస్తు చేసుకున్న వారందరికీ నూతనరేషన్ కార్డులను మంజూరు చేసింది. గతనెల నుంచి లబ్ధిదారులకు ప్రత్యేకంగా తయారు చేసిన సంచుల్లో బియ్యాన్ని అందించేలా ఏర్పాట్లు చేసింది.పర్యావరణ హితంగా వస్త్రం, కాగితంతో తయారు చేసిన ఆకర్షణీయ సంచులపై సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఫొటోలను ముద్రించి లబ్ధిదారులకు పంపిణీ చేసింది.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు

పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం ఆహార భద్రత లబ్ధిదారులకు ప్రత్యేక వస్త్రం, కాగితం, తదితర సామగ్రితో తయారు చేసిన సంచుల్లో బియ్యాన్ని అందిస్తోంది. 6కిలోల ప్యాకింగ్ తో సిద్ధం చేసిన బియ్యాన్ని కొన్ని జిల్లాలో అందిస్తుండగా, మరి కొన్ని ప్రాంతాల్లో బియ్యం వేరుగా, సంచులను వేరుగా(సరఫరా అయిన మేరకు) అందించేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ చర్యలు తీసుకుంది. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా, ఇతర అవసరాలకు వినియోగించుకునేలా తయారు చేయించిన ఈ సంచులను తీసుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఆయా సంచుల సరఫరాలోనూ కోత విధించడమేంటని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

వన్ నేషన్.. వన్ రేషన్ నినాదంతో

పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్(పీడీఎస్) బియ్యాన్ని లబ్ధిదారులందరికీ అందించేందుకు ప్రభుత్వం 'వన్ నేషన్.. వన్ రేషన్' విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం ద్వారా లబ్ధిదారులు దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే పోర్టబులిటీ ఉంటుంది. వృత్తి, వలసల కారణంగా పలు రాష్ట్రాలు, జిల్లాలకు తరలివెళ్లిన లబ్ధిదారులు అక్కడ వేలి ముద్ర వేసి రేషన్ తీసుకోవచ్చు. ఈ విధానంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. అయితే నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంచుల(బ్యాగుల) విధానం డీలర్లకు కొత్త ఇబ్బంది తెచ్చిపెడుతోంది.

కేటాయింపునకు అనుగుణంగానే...

రేషన్‌కార్డు పొందిన వారు దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే వీలు కల్పించినప్పటికీ కుటుంబ యజమాని స్థానికతను బట్టి సమీపంలోని దుకాణానికే సంచుల కోటా కేటాయిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సంచులను ఈ కేటాయింపునకు అనుగుణంగా సరఫరా చేసింది. పట్టణంలోని గాంధీనగర్‌నివాసి అయిన వ్యక్తి హైదరాబాద్‌లో రేషన్ తీసుకుంటున్నా ప్రభుత్వం అతడికి కేటాయించిన సంచి మాత్రం గాంధీనగర్‌లోనే తీసుకోవాల్సి ఉంటుంది.

సంచే కదా అనుకుంటే..

పీడీఎస్ బియ్యం నెలనెలా తీసుకునే..

మిగతా 8వ పేజీలో...



సర్కార్ దవాఖానాలో ఆ ఇద్దరు!

- ప్రతీ పనికి, ఫైల్‌కు ఓ రేటు
- పరిపాలనా విభాగంలో ఇష్టారాజ్యం
- ఉద్యోగుల వేతనాలు మొదలు కాంట్రాక్టర్ల బిల్లుల వరకు వసూళ్లే
- ఆస్పత్రి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న వైనం
- అక్రమాలపై ఫిర్యాదుల వెల్లువ

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కొందరు అధికారులు, ఉద్యోగులది ఆడిందే ఆట పాడిందే పాటగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని పరిపాలనా విభాగంలోని ఇద్దరిపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఆస్పత్రి ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టించి వసూళ్ల పర్వానికి తెరతీసినట్టు సమాచారం. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెతనాలు చెల్లించేందుకు కూడా కమీషన్ ఇవ్వనిదే బిల్లు చేయడం లేదని తెలిసింది. పలుమార్లు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆస్పత్రిని తనిఖీచేసిన సమయంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మొరపెట్టుకున్నా విచారణ లేకపోవడంతో వారికి అడ్డూ అదుపు లేకుండా పోయిందనే వాదన వినిపిస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

ఆస్పత్రిలో కొద్ది నెలల క్రితం ఉద్యోగుల వేతనాల చెల్లింపుల విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు ఓ ఉద్యోగిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. అయినా ఇతర విభాగాల్లో పనిచేసే

మిగతా 8వ పేజీలో...

బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



బాలల దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): చదువే ధ్యేయంగా బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నల్లగొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువు ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితేనే బలమైన భవిష్యత్తు నిర్మించుకోవచ్చని, చిన్న వయసులోనే క్రమశిక్షణ, సమయపాలన అలవర్చుకోవాలని సూచించారు. రోజుకు నిర్ధిష్ట సమయం చదువుకు కేటాయించాలని, సోషల్ మీడియా, మొబైల్ ఫోన్, ఇన్‌స్టాగ్రాం వినియోగాన్ని పరిమితం చేయాలన్నారు. పుస్తక పఠనం ద్వారా నైపుణ్యాభివృద్ధి ఉన్నత లక్ష్యాలు నిర్ణయించి వాటిని సాధించే దిశగా కృషిచేయాలన్నారు. ఆడపిల్లలు మగ పిల్లల కంటే తక్కువ కాదని, భయపడాల్సిన అవసరం లేదని, ధైర్యంగా ఉండాలని అన్నారు. చదువుకుంటే డాక్టర్లు, కలెక్టర్లు కావొచ్చని, మనసులో ఏది బలంగా అనుకుంటే ఆ విధంగా తయారవ్వవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి. సీడబ్ల్యూసీ చైర్మన్ చింత కృష్ణ, చైల్డ్‌వెల్ఫేర్ సంస్థ నాగసేనరెడ్డి, డీసీపీవో గణేష్, సరిత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి బాలలే దేశప్రగతికి మూలాలు : ఎస్పీ

నేటి బాలలే దేశప్రగతికి మూలాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. బాలలదినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని ఓ పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని బాలబాలికలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో పరుగులు పెడుతున్న నేటి కంప్యూటర్ యుగంలో పోటీపడాల్సిన వయస్సులోనే మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, ఎస్‌బీ సీఐ రాము, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ లచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరం నిర్వహణ అభినందనీయం

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక ఏఐ టెక్నాలజీతో రూపొందించిన పరికరాలతో ఆరోగ్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఐ ఆధారిత ఎక్స్‌రే స్కానింగ్ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో మొబైల్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ శిబిరంలో ఛాతికి సంబంధిత, రక్త పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐ సంతోష్, డాక్టర్ ప్రదీప్, రవిప్రసాద్, జమాల్, అనిల్‌కుమార్, సైదులు, వెంకట్‌రెడ్డి, సయ్యదుద్దీన్, ఇనాయత్ అలీ, లెనిన్ పాల్గొన్నారు.

చేనేత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నల్లగొండ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చేనేత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సదర్భంగా సత్యం మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు లక్ష కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు. సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత రంగాన్ని గట్టు ఎక్కించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రకటించిన పథకాలను, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఆయన వెంట చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మీనర్సయ్య ఉన్నారు.

నీటి గణనను జాగ్రత్తగా నిర్వహించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): నీటి భద్రతను మెరుగుపరిచి, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి సహకరించే 7వ చిన్న తరహా నీటి వనరుల గణన, 2వ జలాశయాల గణన కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. 7వ చిన్న తరహా సాగు నీటి వనరుల గణన, 2వ జలాశయాల గణన కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ చాంబర్‌లో ముఖ్య ప్రణాళిక అధికారి, సంబంధిత అనుబంధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్న చిన్న తరహా ఇరిగేషన్ వనరులు, కుంటలు, ఆనకట్టలు, అలాగే ఉపరితల నీటి పథకాలను గుర్తించాలన్నారు. వాటి ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయాలన్నారు. జాతీయస్థాయిలో డేటా బేస్ అభివృద్ధి చేసే నిమిత్తం నీటి వనరుల గణన చేపట్టనున్నట్లు తెలిపారు. 1986 నుంచి ఇప్పటివరకు ఆరుసార్లు ఈ గణన చేపట్టనట్లు వివరించారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి 7వ గణన చేయాల్సి ఉందని తెలిపారు. జిల్లాలో ఉన్న చిన్నతరహా నీటిపారుదల పథకాలు, తుంపర్ల సేద్యం, బిందు సేద్యం, ఉపరితల జల పథకాలు, మధ్యతరహా గొట్టపు బావులు , ఉపరితల నీటి షెడ్యూల్ పథకాలను, నిలువ నీటి పథకాలను, చెరువులు, ఇతర పథకాలను లెక్కించడంతోపాటు, రెండో జలాశయాల గణనలో భాగంగా జలాశయాల గణన చేపట్టనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ప్రస్తుతం మైనర్ ఇరిగేషన్ వనరుల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. అందువల్ల వనరుల పునరుద్ధరణ, రైతులకు నీటి భద్రతతో పాటు, నీటి వాడకం సామర్థ్యం పెరిగితే వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి సీపీవో నల్లగొండ ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి, ఆర్డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, ఎలక్ట్రిసిటీ అధికారులు అధికారులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ వ్యతిరేక కమిటీపై సమీక్ష

ఇటీవల ప్రభుత్వ వైద్య కళాశాలలో జరిగిన ర్యాగింగ్ సంఘటనలపై నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాల ర్యాగింగ్ వ్యతిరేక జిల్లాస్థాయి కమిటీ శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జె. సత్యనారాయణ, ఇన్‌చార్జి డీఆర్‌డీవో వై. అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల అదనపు ప్రిన్సిపాల్ ఆర్. రాధాకృష్ణ, సామాజిక కార్యకర్త సురేష్ గుప్తా, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా సమాజ సేవ

డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



జెండాను ఆవిష్కరించిన డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా సమాజ సేవ చేయాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని సహకార కేంద్ర బ్యాంకులో శుక్రవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఏడు రోజుల పాటు సహకార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, ఈ ఆర్థిక సంవత్సరం రూ.4వేల కోట్ల వ్యాపారంతో పాటు రూ.60కోట్ల లాభాలు సాధించేలా కృషిచేయాలన్నారు. నిధుల సమీకరణలో భాగంగా డిసెంబర్ నెలాఖరు వరకు రూ.100కోట్లు డిపాజిట్ సేకరించాలన్నారు. మహిళా సంఘాలకు అతి తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో శంకర్‌రావు, జీఎం నర్మద, పాశం డీసీసీబీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు తోడ్పాటుగా...

మునుగోడు: సహకార సంఘాల ద్వారా రైతులకు సకాలంలో పంట రుణాలతో పాటు ఎరువులు ఇతర వ్యవసాయ విత్తనాలు, పురుగు మందులను అందిస్తూ వారికి అండగా నిలవాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సహకార సంఘ వారోత్సవాలను పురస్కరించుకొని మునుగోడులో సహకార జెండాను ఎగురవేశారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు దుబ్బ గోపాల్, మేకల మల్లయ్య, సింగం వెంకన్న, కుతాటి బిక్షమయ్య, కృష్ణయ్య, మాదరబోయిన యాదయ్య, మార్త మోహన్‌రెడ్డి, నాయకులు భీమనపల్లి సైదులు, పాలకూరి నరిసింహగౌడ్, సహకార సంఘం కార్యదర్శి సుఖేందర్, అశోక్‌రెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

రూ.10కోట్లతో జిల్లా గ్రంథాలయ నిర్మాణం



జిల్లా గ్రంథాలయంలో మాట్లాడుతున్న చైర్మన్ హాఫీజ్‌ఖాన్

నల్లగొండ కల్చరల్, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని టౌన్ హాల్ స్థలంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో రూ.10కోట్లతో జిల్లాకేంద్ర గ్రంథాలయ నూతన భవన నిర్మాణం చేపడతున్నామని గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ.హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించి ఆయన మాట్లాడారు. మంత్రి చొరవతో గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు సమకూ ర్చుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ కౌన్సిలర్లు ఇంతియాజ్, ఇబ్రాహిం, ఖలీల్, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. శ్రవణ్‌కుమార్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బషీరోద్దిన్, గ్రంథాలయ ఉద్యోగులు ఆర్. కుసుమశ్రీ, నిర్మలాదేవి, తారకేశ్వరి, రాజేష్, శ్రీనివాస్, నర్మదా, మల్లేష్, శారద, యామిని తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు కోసం ఉద్యమిస్తాం

బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మునాస ప్రసన్నకుమార్



అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న బీసీ జేఏసి నాయకులు

నల్లగొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని యథావిధిగా అమలు చేయడానికి డిసెంబరు నెలలో ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగాన్ని సవరించి బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు పెంచే వరకు రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని ఆపే ప్రసక్తేలేదన్నారు. తెలంగాణ ఉద్యమ తరహాలో పోరాటం చేసి సాధించుకుంటామన్నారు. కార్యక్రమంలో గండిచెరువు వెంకన్నగౌడ్, అయితగోని జనార్ధన్‌గౌడ్, చిలక రాజు చెన్నయ్య, కృష్ణమూర్తి, పుట్ట వెంకన్నగౌడ్, కట్టెకోలు దీపేందర్, సతీష్‌కుమార్, కర్నాటి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు మహిళా కూలీ

- ఏసీబీ తనిఖీల్లో వెల్లడి

6

పీఆర్‌సీ, డీఏలను వెంటనే ప్రకటించాలి

నల్లగొండ, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ, పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని, లేని పక్షంలో ప్రత్యక్ష పోరాటం చేస్తామని తెలంగాణ రాష్ట్ర విశ్రాంతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్‌సీ గడువు ముగిసి రెండేళ్లయినా నేటికీ అమలు చేయకపోడంతో పెన్షనర్లు, ఉద్యోగులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెన్షనర్ల డిమాండ్లు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి, నాయకులు జె.శ్రీశైలం, గాయం నారాయణరెడ్డి, రంగయ్య, మెహన్‌రావు, యుగేంధర్, ఆంజనేయులు, కృష్ణయ్య, సంతోష్‌రెడ్డి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి

రైతులకు మద్దతు ధర అందించాలి

రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న సీపీఎం నేత బండ శ్రీశైలం

చండూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు మద్దతు ధర అందజేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు ధాన్యం తీసుకువచ్చి రోజులు గడుస్తున్నా నేటికీ కొనుగోలు చేయడం లేదన్నారు. రైస్ మిల్లుల కేటాయింపు కూడా నేటికీ పూర్తికాకపోవడం దారుణమన్నారు. రైతులు నేరుగా మిల్లులకు ధాన్యం తీసుకెళ్తే క్వింటాకు రూ.1,600 నుంచి రూ.1,800 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొండాపురంలో రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చి వారం రోజులైనా అతీగతీ లేదని వాపోయారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, నాయకులు బాలెం స్వామి, రూప లింగయ్య, సత్తయ్య, లింగాస్వామి, అచ్చమ్మ, భాగ్యమ్మ, పాల్గొన్నారు.

నలుగురిలో.. ఒకరికి



ఆరోగ్యం లేకపోతే ఏమి ఉన్నా లేనట్టే లెక్క. మారిన ఆహారపు అలవాట్లతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇష్టాలను చంపుకోలేక జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. ఇది ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తోంది. ఈ అలవాట్లు ఇటీవల మధుమేహం బారిన పడేస్తున్నాయి. ప్రతీ నలుగురిలో ఒకరు ఈ వ్యాధిగ్రస్తులు ఉంటున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాలో 100మందిలో 25 మంది మహిళలు ఉండటంతో పాటు జిల్లా వ్యాప్తంగా పురుషులకంటే మహిళలే ఎక్కువగా మధుమేహ బాధితులు ఉన్నారు.

- (ఆంధ్రజ్యోతి-బీబీనగర్)

» పెరుగుతున్న మధుమేహం వ్యాధిగ్రస్తులు » జిల్లాలో ప్రతీ 100మందిలో 25 మంది మహిళలు » హార్మోన్ల వ్యత్యాసంతో పెరుగుతున్న కేసులు » ముందు జాగ్రత్తలతోనే ప్రాణాలకు రక్ష

మనిషి ఆనందంగా జీవించేందుకు ప్రధాన పాత్ర పోషించే శక్తి శరీరంలో గ్లూకోజ్(చక్కెర) రూపంలో ఉంటుంది. మనం తీసుకునే ఆహారం నుంచే శరీరానికి అవసరమైన శక్తి తయారై రక్తంలో కలుస్తుంది. ఈ ప్రక్రియలో ప్రధాన పాత్ర పోషించేది ఇన్సులిన్ గ్రంథి. శరీరానికి చక్కెర ఎంత అవసరమో అది నియమిత స్థాయిలో ఉండడం అంతే అవసరం. చక్కెర శాతం రక్తంలో పెరిగిందే మనిషి జీవనయానం గాడి తప్పుతున్నట్టు లెక్క. అది మధుమేహ వ్యాధి బారిన పడేస్తుంది.

ముందస్తు లక్షణాలు

మధుమేహం బారిన పడ్డట్లు శరీరంలో వచ్చే మార్పులు సూచిస్తుంటాయి. బరువు పెరగడం, ఒక్కసారిగా బరువు తగ్గిపోవడం, ఎక్కువ ఆకలి, దాహం వేయడం, కాళ్ల తిమ్మిర్లు ఎక్కడం, తరుచూ మూత్రం రావడం, గాయాలు తగిలితే మానకపోవడం వంటివి వ్యాధి సూచనలు చెబుతున్నారు. వీటితో పాటు గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం. శరీరంలో రక్త ప్రసరణ తగ్గిపోవడం. ఇన్‌ఫెక్షన్లు చుట్టుముట్టి ఆరోగ్యాన్ని దెబ్బతీయడం, నరాలు బలహీనం, కిడ్నీ సంబంధిత వ్యాధులు రావడం, కంటి చూపు మందగించడం, పాదాలకు సంబంధించి వ్యాధులు వచ్చేఅవకాశం ఉంటుందన్నారు.

జీవనశైలిలో మార్పులే కారణం

కొన్ని ఏళ్లుగా జీవనశైలిలో వచ్చిన మార్పులే ఎక్కువమంది మధుమేహ బారిన పడటానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. తీసుకునే ఆహారం శరీరంలోకి వెళ్లగా గ్లూకోజ్‌ను విడుదల చేయాలి. దీనినే గ్లైసిమిక్స్ ఇండెక్స్‌గా పిలుస్తారు. ఇది ఎంత తక్కువగా ఉంటే అంత మేలు. గ్లైసిమిక్స్ ఇండెక్స్ అన్నంలో గ్లూకోజ్‌ను వేగంగా విడుదలఅవుతుంది. ఇవి కాకుండా ప్రస్తుతం మధుమేహ వ్యాధి గ్రస్తులకు ప్రత్యేక ఆహారంగా ఓట్స్ మార్కెట్‌లోకి వచ్చాయి. వీటిలో గ్లైసిమిక్స్ ఇండెక్స్ తక్కువగా ఉండడంవల్ల గ్లూకోజ్‌ను నెమ్మదిగా విడుదల చేస్తాయి. ఇలాంటి వాటిని బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకుంటే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

మధుమేహం బారిన పడకుండా ఉండేందుకు వైద్య నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ఒత్తిడి తక్కువగా ఉండే జీవనశైలిని అలవాటు చేసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, నిర్ణీత సమయానికి తగిన మోతాదులో ఆహారం తీసుకోవడం చేయాలంటున్నారు. అదేవిధంగా ఎత్తుకు తగిన బరువు ఉండేలా జాగ్రత్తలు పాటించడం, కుటుంబంలో ఎవరికైనా వ్యాధఙ ఉంటే ముందుజాగ్రత్తలు తీసుకోవడం, ఆలస్యంగా గర్భం వస్తే రక్తపరీక్షలు చేయించుకుని తేడా అనిపిస్తే వైద్యులను సంప్రదించడం శారీరకంగా బలహీనపడిన నీరసంగా ఉన్నా, నరాల నొప్పి ఉన్న తక్షణం వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.



వయసుతో సంబంధం లేకుండానే

గతంలో 40 నుంచి 50ఏళ్ల దాటిన వారిలో మాత్రమే కనిపించే మధుమేహం ఇప్పుడు అన్ని వయస్సు వారిలోనూ కనిపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. కల్తీ ఆహారానికి తోడు, ఆహారఅలవాట్లలో వచ్చిన మార్పులు, శారీరకశ్రమ లోపించడం, అధికబరువు వంటి అనేక అంశాలు చిన్న వయసులోనే మధుమేహం బారిన పడటానికి కారణమవుతున్నాయి. ప్రతీ 10సెకన్లకు ఒకరి చొప్పున ఏడాదికి 40లక్షల మంది మధుమేహం బాధితులు మృత్యువాత పడుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. 80వ దశకంలో 5శాతం మందిలో మాత్రమే కనిపించిన మధుమేహం ప్రస్తుతం 30 శాతానికి చేరుకుందని నిపుణులు చెబుతున్నారు. వచ్చే ఐదేళ్లకు ఇది 40శాతానికి చేరుకునే అవకాశం ఉందంటున్నారు.

యాదాద్రి జిల్లాలో..

యాదాద్రిభువనగిరి జిల్లాలో మధుమేహ వ్యాధిగ్రస్తులు 30,552మంది ఉన్నారు. వీరిలో మహిళలు 15,344మంది కాగా పురుషులు 15, 208మంది ఉన్నారు. ప్రతీ 100మందిలో 30 నుంచి 35మంది డయాబెటిస్ పేషెంట్లు ఉన్న ట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రికార్డులు చెబుతున్నాయి. మహిళ రోగుల సంఖ్య పెరగడాన్ని దృష్టిలో పెట్టుకుని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ డ యోబెటిస్ సొసైటీ ప్రత్యేకంగా మహిళల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతోంది.

కేసులు పెరుగుతున్నాయి



కొన్నిఏళ్లుగా మధుమేహ వ్యాధి బాధితులు పెరుగుతున్నారు. టైప్-2 మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారు. జస్టేషనల్, డయాబెటీస్ కేసులు కూడా ఈ మధ్య ఎక్కువగా వస్తున్నాయి. ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు, శారీరక వ్యాయామం లేకపోవడం, అనేక కరణాలు మధుమేహానికి దారితీస్తున్నాయి. రోజు వారీ వ్యాయామం చేస్తూ పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే మధుమేహానికి దూరంగా ఉండేందుకు అవకాశం ఉంది.

- తోట దుర్గాప్రసాద్ , ప్రభుత్వ వైద్యులు

చక్కెర శాతం పెరిగితే ఇబ్బందే



రక్తంలో చక్కెర శాతం పెరిగితే ప్రమాదకరం. ఆహార పు అలవాట్లు మార్చుకోవా లి. శారీరక శ్రమచేయాలి. అప్రమత్తంగా ఉంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. షుగర్ రహితఆహారానికి ప్రాధాన్యమివ్వాలి. మాంసాహారానికి వీలైనంత దూరంఉండాలి. పీచు పదార్థాలు, ఓట్స్ తీసుకుంటే చాలా మంచిది.

- మౌనిక, వైద్యాధికారి, బీబీనగర్

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఏఎస్పీ



మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

కొండమల్లేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నల్లగొండ జిల్లా దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు ప్రాజెక్ట్ శుద్ధి కార్యక్రమంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, అనర్థాలపై శుక్రవారం మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ లక్ష్యాలు ఏర్పర్చుకొని కష్టపడి చదవాలన్నారు. క్రమశిక్షణతో కూడిన నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. వ్యసనాల బారిన పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్, ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు అపహరణ



స్థానికులను విచారిస్తున్న టూటౌన్ సీఐ సోమనర్సయ్య

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం జరిగింది. బాధితురాలు, టూటౌన్ సీఐ సోమనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం బంగారుగడ్డకు చెందిన వృద్ధురాలు శిరంశెట్టి లక్ష్మి వీధిలో నడుచుకుంటూ వెళ్తోంది. ఇదే సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి వృద్ధురాలిని మాటలో పెట్టి మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ సోమనర్సయ్య తెలిపారు. చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు సంఘటన జరిగిన ప్రదేశంలోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

కపాస్ యాప్‌తో పరేషాన్

పత్తి విక్రయ ప్రక్రియను సులభతరం చేసేందుకు తీసుకువచ్చిన కపాస్ కిసాన్‌యాప్ రైతులను పరేషాన్ చేస్తోంది. సీసీఐలో పంట విక్రయానికి ఈ యాప్‌లో ముందుగా స్లాట్‌బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ మేరకే పత్తిని తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఒక వేళ ముందున్నవారి కొనుగోళ్లు నిలిచిపోతే వారి క్రమం వచ్చే వరకూ వేచిచూడాల్సివస్తోంది. ఈ తతంగం మొత్తంతో విసిగిపోతున్న రైతులు దళారులకు విక్రయించి నష్టపోతున్నారు.

(ఆంధ్రజ్యోతి-డిండి)

గ్రామీణ ప్రాంతాల్లో స్లాట్ ఎలా బుక్ చేసుకోవాలో తెలియని రైతులతో పాటు సెల్‌ఫోన్ కూడా లేని వారు కూడా ఉన్నారు. నూతనంగా తీసుకువచ్చిన ఈ కపాస్ కిసాన్ యాప్‌పై వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించలేదు. ఆచరణలో ఈ యాప్‌లో అనేకలోపాలు స్పష్టమవుతున్నాయి. ఈ యాప్ ద్వారా రోజుకు ఒక్క సీసీఐ కేంద్రంలో 3,300 క్వింటాళ్ల పత్తిని మాత్రమే తూకం వేసి తీసుకోవాలని నిబంధన ఉంది. స్లాట్‌బుక్ చేసుకున్న రైతు పంటను ఏకారణం వల్లనైనా కాటన్ కార్పొరేషన్ ఇండియా(సీసీఐ) కేంద్రంలో సాయత్రం 5 గంటల్లోగా తూకం వేయకపోతే మళ్లీ స్లాట్‌బుక్ చేసుకోవాల్సి వస్తోంది. తన సీరియల్ వచ్చే వరకూ ఆ కేంద్రం వద్ద రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. అప్పటివరకు అద్దెకు తెచ్చిన వాహనానికి(ట్రాక్టర్, లారీ, ఆటో) రోజుకు రూ.1000 వెయిటింగ్ చార్జీ, డ్రైవర్‌కు రూ.400 బత్తా చెల్లించాల్సి వస్తోంది. దీనికితోడు అధికారులు కొనుగోలు చేస్తారా లేదా అనే నమ్మకం లేకపోవడంతో తక్కువ ధరకు దళారీలకు విక్రయించి నష్టపోతున్నారు.

ఎకరాకు 7 క్వింటాళ్లకు పరిమితం

గత ఏడాది పత్తి ఎకరా దిగుబడి 12 క్వింటాళ్లుగా సీసీఐ నిర్ధారించింది. ఈ వానాకాలం ఎకరా పత్తి దిగుబడి 7 క్వింటాళ్లకు కుదించింది. సారవంతమైన నల్లరేగడి భూములలో 7 క్వింటాళ్లకు పైగా దిగుబడి సాధించిన రైతులూ ఉన్నారు. పరిమితికి మించి వచ్చిన దిగుబడిని ఎక్కడ విక్రయించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు ఏజిల్లా రైతులు అదేజిల్లాలో పత్తి విక్రయించాలనే నిబంధన విధించారు. దీంతో పంటను వేరేచోట విక్రయించే వెలుసుబాటులేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

తప్పులతడకగా పంటల నమోదు

వ్యవసాయశాఖ అధికారులు చేసిన పంటల నమోదు తప్పుల తడకగా ఉంది. క్షేత్రస్థాయిలో పరిశీలించాక వ్యవసాయ విస్తరణ అధికారులు పంట వివరాలను నమోదు చేయాలి. కానీ రైతు సాగుచేసిన పంటకు ఏఈవోలు నమోదు చచేసిన వివరాలకు సంబంధం లేకుండా ఉంది. డిండి మండలానికి చెందిన ఓ రైతు తన రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. కానీ ఏఈవోలు ఒక ఎకరం పత్తి మరో ఎకరం వరిసాగు చేసినట్లుగా నమోదుచేశారు. దీంతో రెండు ఎకరాల్లో పండించిన పత్తిని విక్రయించడానికి ఏఈవో చేసిన తప్పు అడ్డంకిగా మారింది.

మిగిలింది అప్పులే

పత్తిసాగు చేసిన రైతులకు పెట్టుబడి రాక అప్పుల పాలవుతున్నారు. అధికవర్షాలతో దిగుబడి తగ్గి రైతులు కోలుకోలేని దెబ్బపడింది. సాగుకు చేసిన అప్పులు తీరేదారిలేక ఆందోళన నెలకొంది. నల్లగొండ డిండి మండలంలో ఈ వానాకాలం సీజన్‌లో 7వేల మంది రైతులు అధికారుల లెక్కల ప్రకారం 16,100 ఎకరాల్లో సాగు చేశారు. పంటను విక్రయించేందుకు 20 కిలోమీటర్ల దూరంలోని సీసీఐ కేంద్రానికి తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ట్రాన్స్‌పోర్టు, వెయిటింగ్ చార్జీలు భరించలేక రైతులు దళారీలకు విక్రయిస్తున్నారు. రైతుల నిస్సాయతను పసిగట్టిన దళారీలు ధర ఇచ్చేందుకు కొర్రీలు పెడుతున్నారు. అటు సీసీఐ కేంద్రానికి వెళ్లలేక క్వింటా రూ.6వేలకు పత్తిని విక్రయించి నష్టపోతున్నారు.



దిగుబడిరాని పత్తిచేను

తేమ నిబంధనతో

పత్తికి ప్రభుత్వం కనీస మద్దతు ధర క్వింటాకు రూ.8,110గా నిర్ణయించింది. 8శాతంలోపు తేమ ఉన్నప్పుడు మద్దతు ధర వర్తిస్తుంది. తేమశాతం 9 ఉంటే కనీస మద్దతు ధరలో ఒక శాతం తగ్గి క్వింటాకు రూ.8,028.90 చెల్లిస్తారు. 11శాతం ఉంటే 3శాతం తగ్గించి రూ.7,866.70లు, 12 శాతం తేమ ఉంటే 4శాతం తగ్గించి రూ.7,785.60లు చెల్లిస్తారు. 12శాతం కంటే తేమ ఎక్కువ ఉన్న పత్తిని సీసీఐ అధికారులు కొనుగోలు చేయరు.

7 క్వింటాళ్ల నిబంధన సడలించాలి



ఎకరాకు 7 క్వింటాళ్ల దిగుబడి నిబంధనను సడలించాలి. అదనపు దిగుబడిని విక్రయించేందుకు రైతులు దళారీలను ఆశ్రయిస్తున్నారు. ఈ ఏడాది భారీవర్షాలతో పత్తి తడిసి తూకం తగ్గింది. కిలో పత్తి ఏరేందుకు కూలీలకు రూ.30 వరకు చెల్లిస్తున్నాం. క్వింటా పత్తి సీసీఐకేంద్రానికి తరలించేందుకు రూ.3500 ఖర్చు వస్తోంది. సీసీఐ నిబంధనలతో పత్తి రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. ప్రభుత్వం నిబంధనలను సడలించి రైతుకు ఆర్థిక తోడ్పాటును అందించాలి.

ముత్యాల శ్యాంసుదర్‌రెడ్డి, చెర్కుపల్లి

రోడ్డు ప్రమాదంలో మేనమామ, అల్లుడు మృతి



సిరాజ్, సైదా(ఫైల్‌ఫొటోలు)

మునగాల/ కోదాడరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇరువురు చికిత్స పొందుతూ మృతి చెందారు. వరుసకు మేనమామ, అల్లుడు కాగా సూర్యాపేట జిల్లా మునగాలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ మండలం తమ్మరకు చెందిన ఎస్‌కే సిరాజ్(32) కోదాడ మునిసిపల్ కార్యాలయంలో ప్రొక్లెయిన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామంలో ఉంటున్న మేనమామ ఎస్‌కే సైదా(35) తమ్మర దగ్గరలోని రైస్ మిల్లు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇరువురు గురువారం వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై మునగాల మండలకేంద్రానికి వెళ్లారు. తిరిగి రాత్రి 10 గంటలకు కోదాడకు వస్తుండగా ఆకుపాముల శివారు కోళ్ల ఫాం సమీపంలో వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇరువురికీ తీవ్రగాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో కోదాడ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించి, వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తమ్మరలో విషాదఛాయలు

రోడ్డు ప్రమాదంలో గ్రామస్థులు ఇరువురి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒకేకుటుంబానికి చెందిన ఇరువురు మృతి స్థానికులను కలచివేసింది. సిరాజ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సైదాకు భార్య, ఇరువురు కుమార్తెలున్నారు. సైదా అన్న పెద్దసైదా మూడు నెలల కిందటే బతుకుదెరువు కోసం సౌదీకి వెళ్లి అక్కడ మృతి చెందారు. ఇరువురి మృతదేహాలకు సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు.

యువ పాడి రైతు ...



రమేష్(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువ పాడి రైతు దుర్మరణం చెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ మండలం దామెర గ్రామానికి చెందిన యువ పాడిరైతు ఉప్పునూతల రమేష్(25) గురువారం సాయంత్రం పాలను తంగడపల్లిలోని పాలకేంద్రంలో పోసి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. దామెర శివారుకు రాగానే నారాయణపురం మండలం చిమిర్యాల నుంచి అజాగ్రత్త, అతివేగంతో వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలకు గురైన రమేష్‌ను స్థానిక అసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయన తండ్రి శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు.

బాత్‌రూంలో కాలుజారి పడి ..



పోచయ్య(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాత్‌రూంలో కాలుజారిపడి తీవ్రగాయాలకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ మండలం ధర్మాజిగూడెం గ్రామానికి చెందిన బద్రి పోచయ్య(45) ఈ నెల 13న ఇంట్లో బాత్‌రూంలో కాలు జారి తీవ్రగాయాలకు గురైయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్ అసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అన్న బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కామెర్ల వ్యాప్తిపై పాఠశాలలో విచారణ

● సమాచారం ఇవ్వకుండా నిర్వహణపై చర్చనీయాంశం

మేళ్లచెర్వు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాఠశాలలో పెద్దసంఖ్యలో విద్యార్థులు కామెర్ల వ్యాధిన బారినపడటంపై జిల్లా విద్యా, వైద్య, పంచాయతీ అధికారులు విచారణ నిర్వహించారు. అయితే సమాచారం ఇవ్వకుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలకేంద్రంలోని ఆరెంజ్ స్కూల్‌లో విద్యార్థులు, అధ్యాపకులు కామెర్ల బారిన పడి ఆసుపత్రిలో చికిత్సపొందడంతో పాటుగా ఆ పాఠశాల ఎల్‌కేజీ విద్యార్థి మండల కేంద్రానికి సుజిత్‌రెడ్డి(5) కామెర్లతో ఈ నెల 3న మృతి చెందాడు. స్పందించిన అధికారులు పాఠశాల ఆవరణలో 450మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించగా తాజాగా వచ్చిన రక్తనమునాల ఫలితాల ప్రకారం 80 మందికి వ్యాధి లక్షణాలు, 24 మందికి నిర్ధారణ, ఒక విద్యార్థికి ఏడు శాతం కామెర్ల లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయినట్లు తెలిసింది. దీంతో శుక్రవారం జిల్లా అధికారులు, స్థానిక అధికారులకు, మీడియా ప్రతినిధులకు సమాచారం అందించకుండా స్కూలు ఆవరణలో గంటసేపు దర్యాప్తు చేపట్టారు. సుజిత్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి పర్యటన వివరాలను బహిర్గతం చేయకుండానే వెనుదిరిగారు. జిల్లా అధికారులు, జిల్లా అధికారుల పర్యటన గురించి ఎంఈవో, ఎంపీడీవో వైద్యాధికారులను సంప్రదించగా తమకు సమాచారం లేదని చెప్పారు.

డెంగీతో ఉపాధ్యాయురాలు మృతి



నాగమణి(ఫైల్)

డిండి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల ఉపాధ్యాయురాలు పీ.నాగమణి(35) డెంగీకి చికిత్స పొందుతూ మృతి చెందారు. కొంతకాలంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. చందంపేట మండలం పొగిళ్ల గ్రామానికి చెందిన నాగమణి 2017 నుంచి డిండి మండలకేంద్రంలో ఉంటూ కస్తూర్బా పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. జ్వరంతో బాధపడుతున్న ఆమె ఈ నెల 12న హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్‌ఆస్పత్రిలో చికిత్సకోసం చేరారు. వ్యాధి బారిన పడి తీవ్రఅస్వస్థతకు గురై మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

లైంగికదాడికి యత్నించిన వ్యక్తిపై పోక్సో కేసు

మోటకొండూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలికపై లైంగికదాడికి ప్రయత్నించిన వ్యక్తిపై పోక్సో, అట్రాసిటీ కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు మండలకేంద్రానికి చెందిన ఓ వ్యక్తి బాలిక కుటుంబసభ్యులతో స్నేహపూర్వకంగా ఉంటూ వస్తున్నాడు. ఇటీవల బాలిక ఇంట్లో గొడవ జరగ్గా అది అదునుగా తీసుకుని బాలికను రాత్రి తన ఇంటికి తీసుకెళ్లాడు. ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై అత్యాచారం చేయబోయాడు. అతడి నుంచి తప్పించుకుని తల్లిదండ్రుల వద్దకు వెళ్లి విషయం చెప్పడంతో వారు బాలికతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నిడమనూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం మారుపాక గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు బెజవాడ వెంకన్న గేదె ఊరు శివారులో ఓ పొలం వద్దకు మేతకు వెళ్లింది. పొలం శివారులో కేబుల్ వైరు తెగిపోయి ఉంది. గేదె ప్రమాదవశాత్తు తీగకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపారు.

వ్యభిచారగృహంపై పోలీసుల దాడి

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వ్యభిచార గృహంపై నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. పట్టణంలోని రెడ్డికాలనీలో ఇద్దరు మహిళలు వ్యభిచార గృహాన్ని నడిపిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆ ఇంట్లో ముగ్గురు మహిళలు, ఒక విటుడు దొరికినట్లు సీఐ నాగభూషణరావు తెలిపారు. పట్టుబడ్డ వ్యక్తుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.1000 నదగు, ఇతర వస్తువులు స్వాధీనపర్చుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అసంపూర్తిగా టెండర్ కం బహిరంగ వేలం

కనగల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం అధికారులు నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలం అసంపూర్తిగా ముగిసింది. ఆరురకాల వస్తువిక్రయ హక్కుల వేలంలో కొబ్బరికాయలకు, పూలు పండ్లకు మాత్రమే వేలం పూర్తయ్యింది. మరో నాలుగు రకాల వస్తువులకు సరైన వేలం రాక వాయిదా వేసినట్టు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి తెలిపారు. లడ్డూ, పులిహోర, గాజులు, ఫంక్షన్‌హాల్ నిర్వహణ, ఫొటోలు తీసేందుకు వేలానికి సరైన పాట రానందున వాయిదా వేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకటరెడ్డి, ఈవో నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

వలిగొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను పోలీసులు సీజ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ యుగేంధర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లింగరాజుపల్లి గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకడంప్‌లు ఉన్నట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. 30 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. బాధ్యులైన బొడిగె అశోక్, నవీన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేరేడుచర్లలో ట్రాన్స్‌కో అధికారుల తనిఖీలు

నేరేడుచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యాన్ని అరికట్టడం కోసం శుక్రవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో ట్రాన్స్‌కో విజిలెన్స్ డీఈ స్వామి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మొత్తం 14 బృందాలుగా ఏర్పడి 613 సర్వీసులను తనిఖీ చేశారు. వాటిలో 148 సర్వీసులు అధిక లోడును ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. ఎవరైనా అక్రమంగా విద్యుత్‌ను ఉపయోగిస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో హుజూర్‌నగర్ ఏడీఈ నాగిరెడ్డి, ఇన్‌చార్జి ఏఈ పందిరి శ్రీనివాస్, పలువురు డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు మహిళా కూలీ

● రోజుకు రూ.500 చెల్లింపు... ఏసీబీ తనిఖీల్లో వెల్లడి

● మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.63వేలు సీజ్



మిర్యాలగూడ సబ్‌రిజిస్ట్రార్ బలరాంయాదవ్‌ను ప్రశ్నిస్తున్న ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చంద్ర

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ వసూళ్లకు మహిళా కూలీని నియమించుకుని రోజుకు రూ.500 చెల్లిస్తున్నారు. ఏసీబీ అధికారుల తనిఖీలో ఈ ఆసక్తికర అంశం వెలుగుచూసింది. ఈ తనిఖీల్లో తనిఖీల్లో రూ.63,160 నగదును అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు సీజ్ చేశారు. ఏసీబీ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై సోదాలు నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మొదలైన తనిఖీలు రాత్రి 10గంటల వరకూ కొనసాగుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై తాము గుర్తించిన అంశాలను నల్లగొండ ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చంద్ర మీడియాకు వెల్లడించారు. మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల పనితీరుపై ఫిర్యాదులు రావటంతో కార్యాలయంలోని రికార్డులు, దస్త్రావేజులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. తనిఖీల సమయంలో కార్యాలయంలో ఆరుగురు ఉద్యోగులు ఉండగా, వారికి రెట్టింపు స్థాయిలో 12మంది డాక్యుమెంట్ రైటర్లు ఉన్నారని తెలిపారు. ఓ మహిళకు రూ.500 దినసరి కూలీ చెల్లిస్తూ అమె ద్వారా అక్రమ వసూళ్లు చేయిస్తున్నట్లుగా గుర్తించామని తెలిపారు. కార్యాలయంలో అనధికారికంగా ఉన్న రూ.63,160 నగదును సీజ్ చేశామన్నారు. తమకు లభ్యమైన నగదుకు సంబంధించిన వివరాలు వెల్లడించాలని సబ్ రిజిస్ట్రార్ బలరాంయాదవ్‌ను కోరగా ఎలాంటి సమాధానం రాలేదన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన 19డాక్యుమెంట్లను హక్కుదారులకు ఇవ్వకుండా కార్యాలయంలోనే దాచిపెట్టడాన్ని అనుమానిస్తున్నామన్నారు. అధికారుల పనితీరును పసిగట్టేందుకు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను పనిచేయకుండా చేశారన్నారు. కార్యాలయంలో నాలుగు సీసీ కెమెరాలకు ఒక్క కెమెరా మాత్రమే పనిచేస్తోందని, అది కూడా వెయిటింగ్ కుర్చీల్లో కూర్చునే వారిని గుర్తించే విధంగా అమర్చారన్నారు. మిగతా మూడు సీసీ కెమెరాలను కావాలనే పనిచేయకుండా చేసినట్లుగా తాము గుర్తించామని తెలిపారు. మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బయటపడ్డ అక్రమాల నిగ్గు తేల్చేందుకు హైదరాబాద్‌లోని సబ్‌రిజిస్ట్రార్ సొంత ఇంట్లోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మిర్యాలగూడ కార్యాలయంలోనూ అర్ధరాత్రి వరకు తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. సోదాలు పూర్తయిన అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. తనిఖీలో ఏసీబీ సీఐలు వెంకట్రావు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది క్రితమే మిర్యాలగూడకు పోస్టింగ్

సబ్ రిజిస్ట్రార్ బలరాం యాదవ్ గతంలో సూర్యాపేటలో పనిచేసిన సమయంలో అవినీతి ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురై ఏడాది క్రితమే మిర్యాలగూడకు పోస్టింగ్ ఇప్పించుకున్నాడు. కార్యాలయ సిబ్బందికంటే రెట్టింపుస్థాయిలో డాక్యుమెంట్ రైటర్లు, వారి అసిస్టెంట్లు కార్యాలయంలోని ప్రతి విభాగంలో పెత్తనం చెలాయించడాన్ని అధికారులు గుర్తించారు.

డిసెంబరు 5న జాతీయ సదస్సు



జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

నల్లగొండ టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 'కృత్రిమ మేధస్సు, మిషన్ లెర్నింగ్- భవిష్యత్ తరాలపై విప్లవాత్మక ప్రభావం' అనే అంశంపై డిసెంబరు 5న జిల్లాకేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక రోజు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ఉపేందర్ తెలిపారు. సదస్సు కన్వీనర్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి, కో కన్వీనర్ ఎస్పీ వెంకటరమణలతో కలిసి శుక్రవారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఏఐ/ఎంఎల్ భవిష్యత్ తరాలకు మంచి అవకాశాలు కల్పిస్తూ, పనులు సులభతరం చేసి, కొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తుందని అన్నారు. ఈ శక్తివంతమైన సాంకేతికతను జవాబుదారీగా, నైతికంగా ఉపయోగించడం సవాలుగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అంతటి శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి మునిస్వామి, అకడమిక్ కోఆర్డినేటర్ బి. నాగరాజు, తెలుగు శాఖ అధ్యక్షుడు వెల్దండి శ్రీధర్, అధ్యాపకులు ప్రసన్నకుమార్, అనిల్ అబ్రహం, ఎ. మల్లేశం, ఎన్‌సీసీ ఆఫీసర్ సుధాకర్, జ్యోత్స్న, వెంకట్‌రెడ్డి, శివరాణి, నాగరాజు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం జీవితంలో భాగం కావాలి



విద్యార్థులతో కలిసి పాదయాత్ర చేస్తున్న జానకిరామ్‌చౌదరి

త్రిపురారం, నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి నడక, వ్యాయామం జీవితంలో భాగంగా చేసుకుంటే శారీరక, మానసిక దృఢత్వం ఏర్పడుతుందని పట్టణ ప్రముఖుడు జానకిరామ్ చౌదరి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉపాధ్యాయుడు ధనవత్ సైదానాయక్, విద్యార్థి ధనవత్ గగన్‌నాయక్‌లతో కలిసి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్ నుంచి త్రిపురారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు 12కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అందరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని అందుకే 72 సంవత్సరాల వయస్సులోనూ ఉత్సాహంతో పాదయాత్ర చేసినట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే నడక, వ్యాయామం వంటి ఆరోగ్య పరిరక్షణ అలవాట్లను ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. మత్తు పానీయాలు, గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బంజార ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్, మక్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధరల పట్టికలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు

యాదగిరిగుట్ట నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలోని దుకాణ సముదాయాల్లో విక్రయించే వస్తువులకు సంబంధించి దుకాణం ఎదుట స్థిర ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని డీఈవో దోర్బల భాస్కరశర్మ అన్నారు. యాదగిరికొండపై ప్రధాన కార్యాలయంలో శుక్రవారం వర్తకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్ణీత ధరలకు కాకుండా, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. అమలుపై దేవస్థాన అధికారులు తరుచూ తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఆక్రమణలకు పాల్పడకుండా దేవస్థానం కేటాయించిన స్థలంలోనే వర్తకం నిర్వహించాలన్నారు. అదనపు వ్యాపారం నిర్వహించడం నిబంధనల ఉల్లంఘనే అన్నారు. దేవస్థానం అనుమతించిన వ్యక్తులతోనే వర్తకం నిర్వహించే బదులు, ఇతర వ్యక్తులను నియమించడం, దుకాణాలను సబ్-లీజుకు ఇవ్వడం నిషేధమన్నారు. నిబంధనలు పాటించకుంటే జరిమానాలు, లైసెన్స్ నిలిపివేత, లీజ్ రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రఘు, జాటోత్ శంకర్‌నాయక్, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి కోటమైసమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు



కోటమైసమ్మ ఆలయం



నిడమనూరు, నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ఇండ్లకోటయ్యగూడెం గ్రామం సమీపంలో ప్రసిద్ధి చెందిన కోటమైసమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 16, 17, 18వ తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కోటమైసమ్మ అమ్మవారి విగ్రహాన్ని కార్తీకమాసంలో ప్రతిష్ఠించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే కాకుండా గుంటూరు, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. మొదటి రోజు సుప్రభాతసేవ, గణపతిపూజ, చండీహోమం, రెండో రోజు బలిహరణం, కుంభం నైవేద్యం సమర్పణ, సర్వదర్శనం, చివరి రోజున పూర్ణాహుతి, అమ్మవారికి బోనాలు సమర్పించి, సాయంత్రం కార్తీక దీపాలంకరణ మహోత్సవం నిర్వహించనున్నారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సిరికొండ నవీన్, ఛైర్మన్ చౌటి ఆంజనేయులు తెలిపారు.

కళా సంపద.. కనుమరుగవుతోంది

● శిల్పుల గ్రామం కన్నెకల్ ● ఆలయాలు, కట్టడాలకు నెలవు ● కాకతీయుల అద్భుత కళావైభవం ● పర్యవేక్షణ కరువై నేడు శిథిలం

కాకతీయుల పరిపాలనలో కన్నెకల్ గ్రామం శిల్పుల గ్రామంగా వెలుగొందింది. 13వ శతాబ్దం కాలం నాటి కాకతీయుల సామంతరాజైన కుందూరు చోళులు పానగల్ రాజధానిగా పరిపాలన కొనసాగించేవారు. ఆనాటి కాలంలో కన్నెకల్‌ను కర్నెకోటగా పిలిచేవారు. కళలకు నెలవుగా ఉన్న గ్రామంలో చోళుల కాలంలో నలుపురాయి, గణపతి విగ్రహం, సప్త మాత్రుకలు, బ్రహ్మ విగ్రహాలను చెక్కించారు. నాటి అద్భుత కళా సంపద నేడు ఆదరణకు నోచుకోవడం లేదు. పర్యవేక్షణ కరువై ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న శిల్ప సంపదను పరిరక్షించాలని నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని కన్నెకల్ గ్రామస్థులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన కన్నెకల్ గ్రామంలోని మల్లికార్జున దేవాలయం

● ఆంధ్రజ్యోతి, మాడ్గులపల్లి

కాకతీయుల కాలం నాటి చక్రతీర్థ బావి, నాగుల చెరువు, అనంత పద్మనాభస్వామి దేవాలయం, కర్నెకోట, కోట గుడి నిర్మించారు. గ్రామంలో సుమారు 600 ఏళ్ల క్రితం నిర్మించిన శివాలయం కూడా ఉంది. కాకతీయుల కాలం నాటి విగ్రహాల్లో కొన్నింటిని పానగల్ మ్యూజియానికి తరలించగా మిగిలిన వాటితోపాటు పురాతన కట్టడాలు, ఆలయాలు శిథిలమై కనుమరుగవుతున్నాయి. కాకతీయుల శిల్ప సంపదను, చరిత్రను కాపాడాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం నేటి తరానికి చరిత్ర తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని చెబుతున్న రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు, చరిత్రను కాపాడకుండా కాలయాపన చేస్తున్నారని, ఆలయాలు, శిల్పసంపద కనుమరుగు అవుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తవ్వకాలు చేపడితే ఆనాటి చరిత్రను వెలికితీస్తే భవిష్యత్ తరాలకు చరిత్ర తెలుస్తుందని చెబుతున్నారు.

బురుజులే మూల స్తంభాలు

కన్నెకల్ గ్రామం కొండగడప వెలుబండి పాలనలో ఉండేది. ఆ గ్రామం మొత్తం కోట లోపలే ఉండేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అప్పటి కోట ప్రస్తుతం ఆనవాళ్ల లేకుండా పోయింది. గ్రామానికి నలుదిక్కులా బురుజు నిర్మించి వాటికి రక్షణ గోడ కూడా నిర్మించారు. బురుజు సైతం పూర్తిగా శిథిలమవగా, ఒక్క బూర్జు నేడు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ గ్రామం నిజాం పరిపాలన కాలంలో మిర్యాలగూడ తాలూక పరిధిలో ఉండేది. ఈ పరిధిలో కన్నెకల్ గ్రామం, నారాయణపురం, గ్యారకుంటపాలెం, కేశవాపురం, మాచనపల్లి, ధర్మా పురం, గోపాలపురం ఉమ్మడి గ్రామ పంచాయతీలో ఉండేది. ప్రస్తుతం ఈ గ్రామాలను నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశారు.

పానగల్ మ్యూజియానికి కొన్ని విగ్రహాలు

గ్రామంలో ఉన్న ఆలయాల్లో విగ్రహాలు, నులుపురాయి వంటివి శిథిలావస్థకు చేరుకోవడంతో పురావస్తుశాఖ అధికారులు ముందుగానే గుర్తించారు. 40ఏళ్ల క్రితమే ఆయా విగ్రహాలను నల్లగొండ పట్టణంలోని పానగల్ సమీపంలోగల మ్యూజియంలో భద్రపరిచారు.

ప్రభుత్వం చొరవ చూపాలి



పురావస్తుశాఖ శ్రద్ధ వహించి తవ్వకాలు జరిపిస్తే శిలా సంపద దొరుకుతుంది. ప్రాచీన కాలం నాటి శిలా సంపదను కాపాడడానికి ప్రభుత్వం చొరవ చూపాలి.

● కొలనుపాక వాసుదేవరావు, పూజారి.

కంపచెట్లతో నిండిన చక్రతీర్థ బావి



కాకతీయుల కాలంలో కన్నెకల్‌లో తెల్లరాయితో నిర్మించిన చక్రతీర్థ బావికి ఒక ప్రత్యేకత ఉంది. ఆ కాలంలో అనంత పద్మనాభస్వామి స్నానానికి ఉపయోగించేవారని ప్రజల నానుడి. ఇక్కడి నుంచి దాదాపు ఎనిమిది కిలోమీటర్ల మేరా బాలాంతమ్మ ఏనె వరకు సొరంగ మార్గం ఉండేదని రాజులు యుద్ధ సమయంలో రహస్య దారిగా ఈ సొరంగ మార్గాన్ని ఉపయోగించేవారని చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ బావి మొత్తం 100 అడుగుల లోతు, 20 ఫీట్ల వెడల్పు, 60 ఫీట్లు పొడవుతో రెండు స్నానపు గదులు కూడా నిర్మించి ఉన్నాయి. ఈ బావి నుంచే స్వామి వారికి అభిషేక, పూజా కార్యక్రమాలకు నీరు ఉపయోగించేవారని నానుడి. ప్రస్తుతం ఆ బావి కంపచెట్లతో నిండిఉంది.

పురాతన ఆలయాలను పరిరక్షించాలి



కన్నెకల్ గ్రామంలో శిథిలావస్థకు చేరిన పురాతన ఆలయాలు, శిల్ప సంపదను పరిరక్షించాలి. చారిత్రక చిహ్నాలు కాలగర్భంలో కలిసి పోతున్నాయి. దశాబ్ద కాలం నాటి కాకతీయ వైభవం కనుమరుగు కాకుండా చూడాలి. కన్నెకల్ గ్రామంలో పురావస్తుశాఖ అధికారులు పరిశోధన చేస్తే మరికొన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

● సర్నాల నాగరాజు, కన్నెకల్ గ్రామస్థుడు

వంశాల పేరుతో వెలసిన గ్రామాలు

సుమారు 200 ఏళ్ల క్రితం 10 విశ్వ బ్రాహ్మణ కుటుంబాలు శిల్పకళ వృత్తి కోసం ఈ గ్రామానికి వలస వచ్చాయి. ఇప్పటికీ ఆయా కుటుంబాల వంశాల పేరుతో గ్రామాలు వెలసిల్లాయి. కన్నెగంటి వంశీయుల పేరుతో కన్నెకల్ గ్రామం వెలుగొందింది. అదేవిధంగా వంగాలవారి కుటుంబాలు ఎక్కువగా ఉండడంతో వంగాలవారిగూడెం, జొన్నగడ్డల గూడెం, మామిళ్లగూడెం, బోడోనిబాయి గ్రామాలు అవతరించాయి.



గుట్టలో వైభవంగా సువర్ణ పుష్పార్చన

యాదగిరిగుట్ట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. .ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొల్పి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం కొనసాగాయి. సాయంత్రం అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 30,78,516 ఆదాయం సమకూరింది. కాగా, కొండకింద ఆధ్యాత్మిక వాడల్లో 929 జంటలు సత్యదేవుని వ్రతాల్లో పాల్గొన్నాయి. అదేవిధంగా కార్తీక దీపాలు వెలిగించి భక్తులు మొక్కలు తీర్చుకున్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మట్టపల్లిలో స్తంభోద్భవుడికి విశేష అర్చనలు

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి ఆలయంలో స్వామికి విశేష అర్చనలు జరిగాయి. ఆలయంలో ప్రాతఃకాలార్చనలు పూర్తయాక అర్చకులు మూలవరులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉపాలయాల్లో పరివార దేవతలకు ప్రాభోది నివేదనలు సమర్పించాక క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగింది. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహుడి మూర్తులను కల్యాణ వేదికపై అధిష్ఠింపజేసి విశ్వక్సేనారాధన వేదపండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈవో సరికొండ నవీన్ ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుందుబి దూకుడు..



శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారి 765పై పక్కన ఉన్న డిండి జలాశయం అలుగు పోస్తోంది. జలపాతాన్ని తలపిస్తున్న ఈ సుందర దృశ్యం పర్యాటకులను ఆకర్షిస్తోంది. అలుగు అందాలు చూసేందుకు శ్రీశైలం వెళ్లే యాత్రికులు ప్రాజెక్టు దిగువన ఉన్న బ్రిడ్జిపై నిలబడి ఈ దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు. ● (ఆంధ్రజ్యోతి, డిండి)

రోడ్డు పనుల్లో కాలయాపన

● సమన్వయ లోపంతో ముందుకు సాగని పనులు



కొత్తగూడెం రహదారిపై ఏర్పడిన గుంతలు

అర్వపల్లి నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): మూడు జిల్లాలను కలిపే సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలోని తిమ్మాపురం-కోడూరు గ్రామాల మీదుగా వెళ్లే రహదారి ఏడాది నుంచి పనులు ముందుకు సాగడం లేదు. రూ.32కోట్లతో పనులు చేపట్టినా.. అధికారులు, కాంట్రాక్టర్ల సమన్వయ లోపంతో కాలయాపన జరుగుతోంది. తుంగతుర్తి మండలం సంగెం నుంచి మొదలైన పనులపై అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉంది. కోడూరు గ్రామ పాలేరు వాగుపై బ్రిడ్జిని ఈ ఏడాది మే నెల వరకు పూర్తి చేయాల్సి ఉండగా నేటికీ పునాది కూడా తీయకపోవడంతో వర్షాలు కురిసినప్పుడల్లా వాగు ఉధృతంగా ప్రవహిస్తే తిమ్మాపురం, కొమ్మాల, కోడూరు, సం గెం, తుంగతుర్తి, అన్నారం గ్రామాలకు వెళ్లే రహదారి మొత్తం రాకపోకలు బంద్ అవుతున్నాయి. కోడూరు గ్రామం వర్షం వచ్చినప్పుడల్లా జలదిగ్బంధంలో ఉంటోంది. వర్షాకాలం తర్వాతే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు. తిమ్మాపురం గ్రామం నుంచి ఈ రహదారి నిర్మాణం కొనసాగాలి. ఇళ్లు ఉండడంతో సర్వేచేసిన దాఖలాలు లేవు. తిమ్మాపురం గ్రామ సమీపంలో రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు మాత్రమే తొలగించారు తప్ప రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. జాజిరెడ్డిగూడెం మండలంలో బొల్లంపల్లి, వేల్పుచర్ల గ్రామాలకు వెళ్లే రహదారులు తారుకు నోచుకోలేదు. టెండర్లు పిలిచామని చెబుతున్నా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. అర్వపల్లి, కాసర్లపాడు, కొమ్మాల గ్రామాలకు తారు రోడ్డు పెద్ద పెద్ద గుంతలు పడి అధ్వానంగా మారింది.

11సార్లు టెండర్లు పిలిచినా...



వాగు దాటుతున్న తిమ్మాపురం-కోడూరు గ్రామాల ప్రజలు (ఫైల్)

జాజిరెడ్డిగూడెం మండలంలో కొత్తగూడెం మారుమూల గ్రామం. 15ఏళ్ల క్రితం రూ.2కోట్లతో తారు రోడ్డు వేశారు. వేసిన సంవత్సరానికే ఇసుక లారీలు రాకపోకలు సాగించడంతో ధ్వంసమైంది. అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు పడి ప్రమా దకరంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణించాలంటే ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.70లక్షలు నిధులు మంజూరయ్యాయి. 11 సార్లు టెండర్లు వేసి పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు.

తారు రోడ్ల నిర్మాణాలకు నివేదిక తయారు చేశాం

మండలంలోని గ్రామాలకు వెళ్లే రహదారులకు తార్ రోడ్ల నిర్మాణాలకు నివేదికలు తయారు చేశాం. బొల్లంపల్లి గ్రామానికి తారు రోడ్డు కోసం టెండర్లు పిలిచాం. తిమ్మాపురం-కోడూరు మధ్యలో చేపట్టే రహదారి పనులు వేగవంతం చేస్తాం.

● బాబురావు పంచాయతీరాజ్ డీఈ

పాఠశాలలకు పూర్వ విద్యార్థుల వితరణ

శాలిగౌరారం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందించడం అభినందనీయమని పూర్వ విద్యార్థి, నల్లగొండ ఆర్డీవో యారాల అశోక్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాదారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మాదారం ఉద్యోగుల గ్రూపు విరాళం ద్వారా పాఠశాల అభివృద్ధికి రూ.2లక్షల విలువైన ఉపకరణాలు అందజేశారు. స్కూల్‌కు 40 కుర్చీలు, బోర్డు, మండల పరిషత్ స్కూల్‌కు ఆడియో సిస్టమ్, 5 కుర్చీలు, ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బ్యాడ్జీలు, బెల్టులు, ఐడీ కార్డులు, 5కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లగిశెట్టి సత్యనారాయణ, సీనియర్ సిటిజన్ పాలకుర్తి కృష్ణమూర్తి, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ చంద్రయ్య, ఎంఈవో మందుల సైదులు, సింగరేణి ఐటీ మేనేజర్ ఉండ్రాతి కృష్ణయ్య, ఉపాధ్యాయులు తంగేళ్ల వీరస్వామి, అనుమాల శ్రీనివాస్, మామిడి సైదులు ఉన్నారు.



సౌండ్ సిస్టమ్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థి, నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి

వేతనాలు అందక ఆరు నెలలు


● కుంటుబపోషణ కష్టంగా గోపాలమిత్రలు ● పశుసంపద రక్షణలో కీలక పాత్ర ● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 235 మంది గోపాలమిత్రలు



పశువులకు టీకాలు వేస్తున్న గోపాలమిత్ర(ఫైల్)

మద్దిరాల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పశుసంపద రక్షణలో కీలక పాత్ర పోషించే గోపాలమిత్రలకు వేతన వెతలు వెంటాడుతున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. ఆరు నెలలుగా వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. గౌరవ వేతనంతో సేవలందిస్తుండగా నెలల తరబడి వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందించే వేతనం చెల్లించకపోవడంతో అప్పులతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని పేర్కొంటున్నారు. 2000 సంవత్సరంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ(డిస్ట్రిక్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ద్వారా గోపాల మిత్ర వ్యవస్థను ఏర్పాటు చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గోపాలమిత్రుల పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడంతో పాటు పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు ప్రథమ చికిత్స అందజేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న నట్టల నివారణ మందులు, వ్యాక్సినేషన్, బీమా చేయించడం, పశువైద్యుల సూచనల మేరకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 235 మంది గోపాలమిత్ర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గోపాలమిత్ర సిబ్బంది నెలకు 50నుంచి 65 పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాలనే టార్గెట్ ఉంటుందని చెబుతున్నారు. దీనికి రూ.40చొప్పున రైతుల నుంచి వసూలు చేసి ప్రభుత్వ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుందని తెలి పారు. నిర్దేశించిన లక్ష్యాన్ని ప్రతి నెలా గోపాలమిత్రలు పూర్తి చేయాల్సిందే. లేదంటే నెల వేతనంలో కోత విధిస్తారని తెలిపారు. ప్రభుత్వం నెలకు రూ.10,050 చొప్పున గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. ఎనిమిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గోపాలమిత్ర సిబ్బంది వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది



వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది. ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. చాలా ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నాం. కృత్రిమ గర్భధారణ చికిత్సకు టార్గెట్ లేకుండా చూడాలి. ప్రభుత్వం ఇప్పటికైనా వేతనాలు విడుదల చేయాలి.

● నాగెల్లి శ్రవణ్‌కుమార్, గోపాలమిత్ర, మద్దిరాల మండలం.

త్వరలో విడుదలవుతాయి

గోపాలమిత్రలకు ఆరు నెలలుగా వేతనాలు రావడం లేదు. త్వరలోనే వేతనాలు విడుదలయ్యే అవకాశముంది. .

● రాజశేఖర్, సూర్యాపేట జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

బియ్యం ఇస్తున్నా.. సంచులు ఇస్తలేరు!

(5వ పేజీ తరువాయి)

లబ్ధిదారులు సంచి విషయంలో డీలర్లతో గొడవపడుతున్నారు. ప్రతి నెలా బియ్యం తీసుకుంటున్నా సంచి ఎందుకు ఇవ్వవడంలేదని గట్టిగా ప్రశ్నిస్తున్నారు. అయితే లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా సంచులు రేషన్ దుకాణాలకు ప్రభుత్వం సరఫరా చేసిందని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి బియ్యం అయితే ఇస్తాంగానీ, సంచులు కేటాయించలేమని రేషన్ డీలర్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంచులను లబ్ధిదారులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నేతలు కోరుతున్నారు.



ఎంతమంది ఉన్నా.. ఒక్కటే సంచి

రేషన్‌కార్డుదారుడి కుటుంబంలో ఎంత మంది ఉన్నా ఒక్కటే సంచి అందిస్తున్నారు. 6కిలోల ప్యాకేజీ ప్రకారం కుటుంబానికి సంచులు పంచాల్సి ఉండగా, అందుకు భిన్నంగా కుటుంబమంతటికీ కలిపి ఒకే ఒక సంచి ఇస్తున్నారు. ప్రభుత్వం సదుద్దేశంతో ప్రవేశపెట్టిన సంచు ల పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ప్రత్యేకంగా తయా రు చేసిన సంచులను విరివిగా పంచితేనే ప్లాస్టిక్ వినియోగం కొంతమేరకైనా తగ్గుతుందంటున్నారు లబ్ధిదారులు.

జిల్లాకు 4.65లక్షల సంచులు

జిల్లాలో 997 రేషన్ దుకాణాలు ఉండగా, ఇటీవల జారీ చేసిన నూతన కార్డులతో కలిపి 5,31,828 రేషన్‌కార్డులున్నాయి. కార్డుల్లో నమోదైన సభ్యుల వివరాలకు అనుగుణంగా 9,500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు. కార్డులో నమోదైన ఒక్కో లబ్ధిదారుడికి 6 కిలోల చొప్పున బియ్యం కేటాయింపు జరగ్గా, అదే ప్రాతిపదికన ఒక్కో లబ్ధిదారుడికి ఒక సంచి అందించాల్సి ఉంది. అయితే జిల్లాకు 4.65లక్షల సంచులు సరఫరా అయినట్లు సమాచారం.

ప్రచారం కోసమే సంచులు



సంచుల పంపిణీ విషయంలో ప్రభుత్వ ఆలోచనేంటో అర్థం కావడం లేదు. ఎందుకు ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు? అమలుచేస్తున్న వారు లబ్ధిదారులకు సరిపడా సంచులు అందజేయాలి. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలనుకోవడం మంచి నిర్ణయమే. 6కిలోలు నింపిన సంచులను అందిస్తే ఉపయోకరంగా ఉండేది. సంచుల సరఫరా అధికార పార్టీ ప్రచారం కోసమే తప్ప మరెందుకు కాదు.

- డబ్బీకార్ మల్లేష్, సీపీఎం నాయకుడు, మిర్యాలగూడ

బియ్యం ఎక్కడ తీసుకుంటే అక్కడ అందజేయాలి



రేషన్ బియ్యం పంపిణీని పర్యావరణ హితమైన సంచుల ద్వారా చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం మంచిదే. అయితే కోటా బియ్యాన్ని తీసుకున్న చోటే లబ్ధిదారులకు సంచులు అందజేయాలి. బియ్యం ఒక చోట, సంచి మరోచోట తీసుకోమనడం సరి కాదు. ప్రభుత్వ విధానంతో అటు రేషన్ డీలర్లు, ఇటు లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. బియ్యం అందిస్తున్న తరహాలోనే సంచులకూ పోర్టబులిటీ విధానం అమలు చేయాలి.

- చావల వెంకటేశ్వర్లు, టీడీపీ సీనియర్ నేత, మిర్యాలగూడ

సర్కార్ దవాఖానాలో ఆ ఇద్దరు!

(5వపేజీ తరువాయి)

అధికారులు, ఉద్యోగుల్లో ఏమాత్రం మార్పు కన్పించడం లేదు. చిరు ఉద్యోగులైన అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వచ్చేదే చాలీచాలని వేతనమైనా కమీషన్ ఇవ్వాల్సి వస్తోంది. విషయాన్ని బయటికి చెబితే ఎక్కడ ఉద్యోగం నుంచి తొలగిస్తారోననే ఆందోళనతో వేతనాల్లో కోతపెడుతున్నా మిన్నుకుండిపోతున్నారు.

ముడుపులు ఇస్తేనే కదులుతున్న ఫైళ్లు

ముడుపులు ఇస్తేనే జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలోని అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఫైళ్లు కదులుతున్నాయనే చర్చ సాగుతోంది. ప్రభుత్వం నుంచి బడ్జెట్ కేటాయింపులు ఆలస్యమవుతున్న నేపథ్యంలో తెచ్చిన అప్పులకు వడ్డీలకే సరిపోతోందని, బిల్లుల కోసం సంబంధిత సెక్షన్‌లో ముడుపులు ఇస్తేనే ఫైల్ కదులుతోందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. శానిటేషన్, అవుట్‌సోర్సింగ్, డైట్, డ్రగ్స్ సర్జికల్, ఇంప్లాంట్స్ బిల్లుల చెల్లింపుల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. గతంలో బిల్లుల చెల్లింపు ఫైల్‌పై సంతకం కోసం ముడుపులు తీసుకుంటూ ఓ ఉన్నతాధికారి ఏసీబీకి పట్టుబడినా సంబంధింత అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో మార్పు రాకపోవడం గమనార్హం. ఈ సెక్షన్‌లో ఇద్దరు ఉద్యోగులు అవినీతిపై ఇటీవల రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీకి, మెడికల్ హెల్త్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీకి, జిల్లా ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. వీరిపై గతంలో కూడా అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కాంట్రాక్ట్ ఇప్పిస్తామంటూ లక్షల రూపాయలు వసూలు చేసినట్లు సంబంధిత సెక్షన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ముడుపులు ఇవ్వని ఉద్యోగులతో పాటు కాంట్రాక్టర్లకు చెందిన ఫైళ్లను రోజులు, నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నట్టు తెలిసింది.

శాఖపర చర్యలు ఉండేనా?

ఉన్నతాధికారుల సమీపంలో ఉండే ప్రభుత్వ ఆస్పత్రి కార్యాలయంలో అక్రమాలు జరుగుతుండగా, వాటిపై దృష్టిసారించి శాఖపర చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు ఉండటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ ఫైళ్లు పెండింగ్‌లో ఉంటే కింది స్థాయి అధికారులను, ఉద్యోగులను ప్రశ్నిస్తే పెండింగ్ వెనుక తతంగం బయట పడే వీలుంటుంది. సరైన సమయంలో ఇంప్లాంట్స్‌తో పాటు మందులు, శానిటేషన్ వస్తువులు సరఫరా కావాలంటే ఫైల్‌ను త్వరితగతిన పరిష్కరించాలి. అయితే సంబంధిత అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు లేదా ఫైల్‌ను తొక్కిపెట్టి ముడుపులు అందాక క్లియర్ చేస్తున్నారు. దీంతో పలు విభాగాల్లోని రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అలాంటిదేమీ లేదు

అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఎలాంటి అక్రమాలు లేవు. ఎప్పటికప్పుడు పరిపాలనా విభాగం కార్యాలయంలో పర్యవేక్షణ చేస్తుంటాం. శానిటేషన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించి బడ్జెట్ రావాల్సి ఉంది. డబ్బు ఇస్తేనే ఫైల్ కదలిస్తున్నారనే ఫిర్యాదులు రాలేదు. డబ్బు తీసుకొని పనులు చేస్తున్నారనేది వాస్తవం కాదు. ఈ విషయంలో ఏవైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం.

- అరుణ కుమారి, సూపరింటెండెంట్

ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి

● జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య

మర్రిగూడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రజలకు జవాబుదారీగా ఉండి పనులు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కె.వెంకయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు ఉత్పన్నం కాకుండా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యదర్శులు విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదంటున్నారు. ఇంటి పనుల వసూల్ డంపింగ్‌యార్డు నిర్వహణ తదితర అంశాలపై సలహా సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీవో మున్నయ్య, ఎంపీవో రవికుమార్, యూసుఫ్ ఉన్నారు.

శ్రీశాంభవీదేవికి భక్తుల పూజలు



చిట్యాలరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుక్రవారం పురస్కరించుకుని చిట్యాల మండలం నేరడలోని శ్రీమహమ్మాయి శాంభవీదేవి ఆలయంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీమహమ్మాయి శాంభవీదేవీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను, అభిషేకాలను నిర్వహించారు. అమ్మవారికి దేవరకొండకు చెందిన నారాయణదాసు అరవింద్ అభిషేక కార్యక్రమాలను నిర్వహించి పూజలో పాల్గొన్నారు. పురోహితులు అమ్మవారికి పూజాకార్యక్రమాలను అభిషేకాల అనంతరం పూజలను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారి దర్శించుకోవడంతో ఆలయాల్లో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది.

19న సీపీఆర్ రచనల పుస్తకావిష్కరణ

శాలిగౌరారం, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): భారత విప్లవోద్యమ నిర్మాత చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సందర్భంగా ఆయన రాసిన ముఖ్యమైన రచనలనుసీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో పుస్తక రూపంలో ముద్రించి ఈనెల 19న పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. పుస్తకావిష్కరణ సభను హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నకిరేకల్ డివిజన్ కార్యదర్శి అంబటి చిరంజీవి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బొమ్మిడి నగేష్ తెలిపారు. శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామంలో అమరుడు పలస బిక్షం స్తూపం వద్ద సభ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా చిరంజీవి, నగేష్‌లు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, ఈ దేశ విముక్తి కోసం, అణగారిన వర్గాల కోసం కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి విప్లవ ఉద్యమంలో అడుగుపెట్టాడని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు ఉద్యమించాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల నాయకులు వేముల శంకర్, పీవైఎల్ జిల్లా కార్యదర్శి బి. వి చారి, ఏఐకెయంఎస్ నాయకులు పుట్ట సత్తయ్య, బీసీపీ జిల్లా నాయకులు బొల్లికొండ లింగయ్య, దళిత మహాసభ కన్వీనర్ కాశీరాం, దేవరకొండ జానయ్య, లింగయ్య, బొల్లెపల్లి వెంకన్న, దేవరకొండ అల్లయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నల్లగొండరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికుల సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్ అవుట రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎలక్ట్రిసిటీ స్టోర్ హమాలీ యూనియన్ జనరల్ బాడీ సమావేశం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో, ఎస్ఎల్‌బీసీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో మార్కెట్ హమాలీ యూనియన్ జనరల్ బాడీ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రకాల సరుకుల ఎగుమతి, దిగుమతిలో కీలక పాత్ర పోషించే హమాలీ కార్మికుల శ్రమను పాలకులే దోచుకుంటున్నారని విమర్శించారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం

మర్రిగూడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మునుగోడు డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి రావుల విద్యాసాగర్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం ఆవరణలో శుక్రవారం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ మొక్కలను సాగు ఒక సారి నాటితే పంట దిగుబడి నాలుగేళ్లకు మొదలై 30సంవత్సరాల పాటు ప్రతీ నెలా ఆదాయం వచ్చే ఏకైక పంట అని అన్నారు. రూ.200 రూపాయల విలువైన మొక్కలను కేవలం రూ.20లకే ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. మార్కెట్ సమస్య కూడా లేదని, ప్రభుత్వమే బైబ్యాక్ అగ్రిమెంట్ కూడా ఉంటుందని అన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వచ్చి ఆయిల్‌పామ్ పంటను చేయాలని అన్నారు ప్రభుత్వం డ్రిప్పు పరికరాలపై సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీలకు, 90శాతం, ఓసీ రైతులకు 80 శాతం రాయితీ ఇస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినిగం చేసుకోవాలని కోరారు. సొసైటీ చైర్మన్ పందుల యాదయ్య అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో మర్రిగూడ ఏవో స ఫ్రాస్, ఏఈవో విజయ్ కుమార్, పతంజలి ప్లాంటేషన్ ఆఫీసర్ భానుచందర్, పతంజలి ఫీల్డ్ అసిస్టెంట్ కలకొండ యాదయ్య, సీఈవో రావిలాల శ్రీనివాస్, మానిటరింగ్ అధికారి శరత్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మర్రిగూడలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న విద్యాసాగర్

ఆయిల్‌పామ్ తోటలు పెంచాలి

మునుగోడు రూరల్: మునుగోడు మండలం పలివెల గ్రామంలో పీఏసీఎస్‌లో నిర్వహించిన సమావేశానికి పతంజలి జిల్లా సీనియర్ మేనేజర్ నర్రా రవీందర్‌రెడ్డి ఆయిల్‌పామ్ పంట గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో పలివెల క్లస్టర్ ఏఈవో నిఖిల్, పతంజలి సీనియర్ మేనేజర్ నర్రా రవీందర్‌రెడ్డి, మునుగోడు పీఏసీఎస్ సీఈవో సుఖేందర్, మానిటరింగ్ అధికారి రేణుక, సంఘం డైరెక్టర్ మోహన్‌రెడ్డి, మునుగోడు పతంజలి ఆయిల్‌పామ్ ఫీల్డ్ అసిస్టెంట్ పాలకూరి స్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి : గుత్తా



చెక్కులను అందజేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ పథకం కింద మంజూరైన రూ.15 లక్షలకుపైగా విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నా రు. సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో ఉపయోగకరమైనదని తెలిపారు. ఈ పథకం ద్వారా పేద ప్రజలకు ఎంతో లబ్ది చేకూరుతుందని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాలరూరల్: పేద, సామాన్య ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం ఉరుమడ్లలో శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్దిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకునే వారికి ఆసుపత్రి బిల్లులతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి డబ్బులు మంజూరవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకు లు కోనేటి యాదగిరి, పోలగోని స్వామి, పల్లపు బుద్దుడు, ఉయ్యాల లింగయ్య, జన్నపాల శ్రీను, బొడ్డు శ్రీను, గుత్తా ర వీందర్‌రెడ్డి, అనంతుల శంకర్, పాలకూరి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

చేనేత రుణమాఫీ అమలు చేయాలి

నాంపల్లి: చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేయాలని, చేనేతల సమస్యలు పరిష్కరించాలని నాంపల్లి పద్మశాలీ కార్మిక సంఘం నాయకులు పిల్లలమర్రి రంగయ్య, సంగం గణేష్ డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీన నల్లగొండలో చేనేత కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించే మహాధర్నా కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం గణేష్, శ్రీరాములు, వెంకటేష్, గోపీకృష్ణ పాల్గొన్నారు.

ధర్నాకు వెళ్లడానికి అనుమతి ఇవ్వాలి

మర్రిగూడ: ఆశా కార్యకర్తల డిమాండ్లను పరిష్కరించాలని, ఈ నెల 17వ తేదీన నల్లగొండలో నిర్వహించే ధర్నాకు వెళ్లడానికి ఆశాలకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారిని సీఐటీయూ నాయకులు కోరారు. శుక్రవారం ప్రభుత్వాస్పత్రిలో సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ శాలినికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కారం కోసం ఈ నెల 17న నల్లగొండలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయమ్మ, వెంకటమ్మ, రాములమ్మ, పలువురు ఆశాలు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలి

కేతేపల్లి: పదో తరగతి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు యత్నించాలని కేతేపల్లి మండల ప్రత్యేక అధికారి ఎం.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని చెరుకుపల్లి గ్రామంలోని కేజీబీవీ, జడ్పీ, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల తరగతి గదుల్లో బోధనా పద్ధతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన నాణ్యతలపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఆయన వెంట ఎంఈవో ఎ.రాజేంద్రప్రసాద్, హెచ్ఎంలు ఉన్నారు.

నేటి బాలలే రేపటి భావి భారతపౌరులు

నల్లగొండటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని విద్యార్థులు సత్ప్రవర్తన ఆత్మవిశ్వాసం, పట్టుదల కలిగి లక్ష్యాన్ని సాధించుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి కేవీ.కృష్ణవేణి అన్నారు. నల్లగొండ పట్టణంలోని బాలసదనం, శిశుగృహలో శుక్రవారం నిర్వహించిన బాలల దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ చింత కృష్ణ, సభ్యులు భాస్కర్, వెంకన్న, జేజేబీ సభ్యుడు మోహన్‌రావు, బీఆర్‌బీ కో ఆర్డినేటర్ హరిత, డీసీపీవో గణేష్, డీసీపీయూ సిబ్బంది తేజస్విని, వెంకన్న, నర్సింహారావు, రాము, రమణి, రేవతి, ఎల్లేశ్వర్, అంజలి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండలంలోని దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో బిట్టు శ్రీనివాస్, మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకట్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు లచ్చిరాం, ఉపాధ్యాయులు రజాక్ రెడ్డి, మంజులత, శ్రీనివాస్, వెంకట్ కుమార్, మీనాతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు రమేష్, శంకర్, రూప ఉన్నారు.



చండూరులోని ఓ పాఠశాలలో వివిధ వేషధారణలో బాలలు

నాంపల్లి : నాంపల్లి మండల కేంద్రంలోని గాంధీజీ ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, గాంధీ విద్యా సంస్థల డైరెక్టర్‌లు కర్నాటి నాగరాజు, సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్ సామల వెంకటేశ్వర్లు, చిలుకూరి రామేశ్వర్, తరుణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చండూరు: మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో అంగన్వాడీ టీచర్లు కేదారీ, సునీత, జగదీశ్వరీ, కరెస్పాండెంట్లు కోడి వెంకన్న, కోటి సుష్మ, డాక్టర్ కోడి శ్రీనివాసులు, గొట్టిముక్కుల చంద్రశేఖర్, పోలోజు నర్సింహ్మాచారి, ఉపాధ్యాయులు రవికాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లగొండ : బాలలు రేపటి భావి భారత స్వప్నాలు అని ఎస్ఆర్ జోనల్ స్కూల్ ఇంచార్జి దోనాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చెడు సవాసాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు చెడు మార్గం వైపు మళ్లించే మొబైల్ ఫోన్స్‌కు దూరంగా ఉండే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్‌లో గల ఆదర్శ పాఠశాల, చెరుకుపల్లిలోని కస్తూర్బా పాఠశాల, భీమారం, కేతేపల్లి జడ్పీ పాఠశాలలు, కేతేపల్లిలోని డీపాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భీమారం జడ్పీ పాఠశాలలో స్వపరిపాలనా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మమత, భీమారం హెచ్ఎం కె.భిక్షమయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కన్నె శివయ్య, మాధవి, జి.రమేష్, భారతి, ఎల్.శ్రీధర్, రాణి, జి.వెంకటేశ్వర్లు, ఎం.శేఖర్, సునీత, డి.నాగయ్య, స్వామి, వెంకట్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.



నల్లగొండ బాలసదనంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న డీడబ్ల్యూవో కృష్ణవేణి

శాలిగౌరారం: శాలిగౌరారంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, జెఎంజె ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, పలు ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నాయకుల వేషధారణలో విద్యార్థులు కనువిందు చేశా రు. సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



శాలిగౌరారం : వివిధ వేషధారణలో బాలబాలికలు

నేడు నార్కట్‌పల్లిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

నార్కట్‌పల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పట్టణ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొత్తగా వేయనున్న విద్యుత్ స్తంభాల తీగలను మార్చడం కోసం ఈ నెల 15 వ తేదీన ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ కె.చంద్రశేఖర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోస్టల్ బీమా చెక్కు అందజేత

నార్కట్‌పల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమ్మాని గ్రామానికి చెందిన కంచోజు వెంకన్న అనే వ్యక్తి పోస్టాఫీస్‌లో బీమా పాలసీ తీసుకున్నారు. ఇటీవల అతను మృతి చెందగా బీమా చేయడం ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును ఆయన భార్య లక్ష్మికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డివిజన్ తపాల సూపరింటెండెంట్ రఘునాథస్వామి, ఐపీపీబీ మేనేజర్ శ్రావణ్, ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి, నెమ్మాని గ్రామ తపాలాధికారి బి. పరమేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలు

శాలిగౌరారం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలిగౌరారం సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి సహకార జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ రిజిస్టర్ డి. నాగేశ్వర్‌రావు, సంఘం సీఈవో నిమ్మల అంజనేయులు, సిబ్బంది యరాల పద్మ, కర్నాటి శంకర్, నిమ్మల నరేష్, చిలుకూరి సుమన్, రాజు, రైతులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

కనగల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) మండలంలోని చర్లగౌరారం గ్రామంలో రూ.12 లక్షల ఈజీఎస్ నిధులతో అంగన్‌వాడీ-1వ కేంద్ర భవన నిర్మాణ పనులకు ఎంపీడీవో వేద రక్షిత శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఏ మెంబర్ రాజు రెడ్డి, ఏఈ రామకృష్ణ, కార్యదర్శి సంతోష్‌రెడ్డి సీహెచ్. వెంకన్న, దొడ్డి సైదులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సెట్విన్ ద్వారా ప్రతీ నెలా రూ.2వేల స్టైఫండ్

నల్లగొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పీఎం వికాస్ పథకం ద్వారా నైపుణ్యాభివృద్ధి కోసం సెట్విన్‌లో ఉచిత శిక్షణకు ఎంపికైన వారికి ప్రతీ నెలా రూ.2వేల స్టైఫండ్‌ను అందజేస్తున్నట్లు ఆ సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మైనార్టీ వ్యవహార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం సెట్విన్‌లో మూడు కోర్సులలో శిక్షణ అందజేస్తుందన్నారు. కాస్మటాలజిస్ట్, వేర్ హౌజింగ్ సూపర్‌వైజర్, ఎమర్జెన్సీ కేర్ అసిస్టెంట్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన, ఆసక్తి గల యువతీ, యువకులు ఈ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిక్షణ ఎంపీడీవోలకు ఫీల్డ్ ట్రైనింగ్

నల్లగొండరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నియమితులైన ఎంపీడీవోలకు ఫీల్డ్ ట్రైనింగ్ శుక్రవారం నిర్వహించారు. మండలంలోని దండంపల్లి గ్రామ పంచాయతీలో ఎంపీడీవో యాకుబ్‌నాయక్ వారికి పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈపీఆర్, ఎంపీవో, ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌దుకాణం ప్రారంభం

కనగల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాలగూడెం గ్రామానికి నూతనంగా మంజూరైన రేషన్ దుకాణాన్ని శుక్రవారం తహసీల్దార్ పద్మ ప్రారంభించారు. మాజీజడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్ రెడ్డి, మాజీ సర్పంచులు గోలి నర్సిరెడ్డి, గోలి జగాల్‌రెడ్డితో కలిసి తహసీల్దార్ రేషన్‌కార్డుదారులకు సరుకులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో 191 కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నాయని తెలిపారు. ఇకపై గ్రామంలో ఏర్పాటు చేసిన రేషన్‌దుకాణంలో ప్రభుత్వం అందిస్తున్న సరుకులను పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఏ మెంబర్ రాజురెడ్డి, కార్యదర్శి నరేందర్, నర్సింహ, పి.అంజయ్య, బిక్షం, సైదులు, నాగరాజు, జానయ్య, రవి, శ్రీను, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఇందిరమ్మ గృహప్రవేశం

కనగల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తేలంకంటిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన శంకరమ్మవెంకన్న నిర్మించిన ఇంటి గృహ ప్రవేశానికి హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన గ్రామంలోని ప్రతీ కుటుంబం త్వరితగతిన ఇంటి నిర్మాణాలను పూర్తి చేసి గృహప్రవేశం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేదరక్షిత, ఎంపీవో సతీష్‌కుమార్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, కార్యదర్శి క్రాంతి, మాజీ సర్పంచ్ రాంబాబు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 28.0
కనిష్ఠం 17.4
***

ANDHRAJYOTHY


నల్లగొండ

5

శనివారం 15 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587 (305.5050)	14,934	14,934
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.15 (4.36)	1,642.81	2,493.07
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.226 (43.0610)	10,544	8,000

చికెన్ ధరలు | లైవ్: రూ.148 | డ్రెస్: రూ.230 | స్కిన్‌లెస్: రూ.260

బియ్యం ఇస్తున్నా.. సంచులు ఇస్తలేరు



రేషన్ దుకాణాల ద్వారా పంపిణీచేస్తున్న సన్న బియ్యాన్ని సంచుల్లో ఇవ్వాల్సి ఉండగా, లబ్ధిదారులకు అవి పూర్తిస్థాయిలో అందడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఇక్కడ రేషన్ ఇస్తున్నా సంచులు ఇవ్వడం లేదు. అదే విధంగా 6కిలోలకు ఒక సంచి చొప్పున ఇవ్వాల్సి ఉండగా, కుటుంబానికి ఒకటి చొప్పున డీలర్లు పంపిణీచేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ టౌన్)



- లబ్ధిదారులకు అందని బ్యాగులు
- కోటా మేరకే అంటున్న డీలర్లు
- కుటుంబానికి ఒక్కటే ఇస్తున్న వైనం

ప్రజా పంపిణీ కేంద్రాల ద్వారా అందించే బియ్యం సరఫరాలో నూతన విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం దొడ్డుబియ్యానికి బదులు సన్నబియ్యాన్ని ఇస్తోంది. పౌరసరఫరాలశాఖ జూన్ మాసంలోనే మూడు నెలలు (జూన్, జూలై, ఆగస్టు) కోటాను ఒకేసారి లబ్ధిదారులకు అందించింది. ఆ తదుపరి దరఖాస్తు చేసుకున్న వారందరికీ నూతనరేషన్ కార్డులను మంజూరు చేసింది. గతనెల నుంచి లబ్ధిదారులకు ప్రత్యేకంగా తయారు చేసిన సంచుల్లో బియ్యాన్ని అందించేలా ఏర్పాట్లు చేసింది.పర్యావరణ హితంగా వస్త్రం, కాగితంతో తయారు చేసిన ఆకర్షణీయ సంచులపై సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఫొటోలను ముద్రించి లబ్ధిదారులకు పంపిణీ చేసింది.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు

పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం ఆహార భద్రత లబ్ధిదారులకు ప్రత్యేక వస్త్రం, కాగితం, తదితర సామగ్రితో తయారు చేసిన సంచుల్లో బియ్యాన్ని అందిస్తోంది. 6కిలోల ప్యాకింగ్ తో సిద్ధం చేసిన బియ్యాన్ని కొన్ని జిల్లాలో అందిస్తుండగా, మరి కొన్ని ప్రాంతాల్లో బియ్యం వేరుగా, సంచులను వేరుగా(సరఫరా అయిన మేరకు) అందించేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ చర్యలు తీసుకుంది. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా, ఇతర అవసరాలకు వినియోగించుకునేలా తయారు చేయించిన ఈ సంచులను తీసుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఆయా సంచుల సరఫరాలోనూ కోత విధించడమేంటని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

వన్ నేషన్.. వన్ రేషన్ నినాదంతో

పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్(పీడీఎస్) బియ్యాన్ని లబ్ధిదారులందరికీ అందించేందుకు ప్రభుత్వం 'వన్ నేషన్.. వన్ రేషన్' విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం ద్వారా లబ్ధిదారులు దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే పోర్టబులిటీ ఉంటుంది. వృత్తి, వలసల కారణంగా పలు రాష్ట్రాలు, జిల్లాలకు తరలివెళ్లిన లబ్ధిదారులు అక్కడ వేలి ముద్ర వేసి రేషన్ తీసుకోవచ్చు. ఈ విధానంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. అయితే నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంచుల(బ్యాగుల) విధానం డీలర్లకు కొత్త ఇబ్బంది తెచ్చిపెడుతోంది.

కేటాయింపునకు అనుగుణంగానే...

రేషన్‌కార్డు పొందిన వారు దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే వీలు కల్పించినప్పటికీ కుటుంబ యజమాని స్థానికతను బట్టి సమీపంలోని దుకాణానికే సంచుల కోటా కేటాయిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సంచులను ఈ కేటాయింపునకు అనుగుణంగా సరఫరా చేసింది. పట్టణంలోని గాంధీనగర్‌నివాసి అయిన వ్యక్తి హైదరాబాద్‌లో రేషన్ తీసుకుంటున్నా ప్రభుత్వం అతడికి కేటాయించిన సంచి మాత్రం గాంధీనగర్‌లోనే తీసుకోవాల్సి ఉంటుంది.

సంచే కదా అనుకుంటే..

పీడీఎస్ బియ్యం నెలనెలా తీసుకునే..

మిగతా 8వ పేజీలో...



సర్కార్ దవాఖానాలో ఆ ఇద్దరు!

- ప్రతీ పనికి, ఫైల్‌కు ఓ రేటు
- పరిపాలనా విభాగంలో ఇష్టారాజ్యం
- ఉద్యోగుల వేతనాలు మొదలు కాంట్రాక్టర్ల బిల్లుల వరకు వసూళ్లే
- ఆస్పత్రి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న వైనం
- అక్రమాలపై ఫిర్యాదుల వెల్లువ

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కొందరు అధికారులు, ఉద్యోగులది ఆడిందే ఆట పాడిందే పాటగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని పరిపాలనా విభాగంలోని ఇద్దరిపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఆస్పత్రి ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టించి వసూళ్ల పర్వానికి తెరతీసినట్టు సమాచారం. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెతనాలు చెల్లించేందుకు కూడా కమీషన్ ఇవ్వనిదే బిల్లు చేయడం లేదని తెలిసింది. పలుమార్లు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆస్పత్రిని తనిఖీచేసిన సమయంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మొరపెట్టుకున్నా విచారణ లేకపోవడంతో వారికి అడ్డూ అదుపు లేకుండా పోయిందనే వాదన వినిపిస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

ఆస్పత్రిలో కొద్ది నెలల క్రితం ఉద్యోగుల వేతనాల చెల్లింపుల విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు ఓ ఉద్యోగిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. అయినా ఇతర విభాగాల్లో పనిచేసే

మిగతా 8వ పేజీలో...

బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



బాలల దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): చదువే ధ్యేయంగా బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నల్లగొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువు ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితేనే బలమైన భవిష్యత్తు నిర్మించుకోవచ్చని, చిన్న వయసులోనే క్రమశిక్షణ, సమయపాలన అలవర్చుకోవాలని సూచించారు. రోజుకు నిర్దిష్ట సమయం చదువుకు కేటాయించాలని, సోషల్ మీడియా, మొబైల్ ఫోన్, ఇన్‌స్టాగ్రాం వినియోగాన్ని పరిమితం చేయాలన్నారు. పుస్తక పఠనం ద్వారా నైపుణ్యాభివృద్ధి ఉన్నత లక్ష్యాలు నిర్ణయించి వాటిని సాధించే దిశగా కృషిచేయాలన్నారు. ఆడపిల్లలు మగ పిల్లల కంటే తక్కువ కాదని, భయపడాల్సిన అవసరం లేదని, ధైర్యంగా ఉండాలని అన్నారు. చదువుకుంటే డాక్టర్లు, కలెక్టర్లు కావొచ్చని, మనసులో ఏది బలంగా అనుకుంటే ఆ విధంగా తయారవ్వవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి. సీడబ్ల్యూసీ చైర్మన్ చింత కృష్ణ, చైల్డ్‌వెల్ఫేర్ సంస్థ నాగసేనరెడ్డి, డీసీపీవో గణేష్, సరిత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి బాలలే దేశప్రగతికి మూలాలు : ఎస్పీ

నేటి బాలలే దేశప్రగతికి మూలాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. బాలలదినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని ఓ పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని బాలబాలికలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో పరుగులు పెడుతున్న నేటి కంప్యూటర్ యుగంలో పోటీపడాల్సిన వయస్సులోనే మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, ఎస్‌టీ సీఐ రాము, వన్‌టౌన్ సీఐ రాజశేఖరరెడ్డి, ఎస్‌ఐ లచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరం నిర్వహణ అభినందనీయం

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, నవంబరు 14 (ఆంధ్ర జ్యో తి): అత్యాధునిక ఏఐ టెక్నాలజీతో రూపొందించిన పరికరాలతో ఆరోగ్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఐ ఆధారిత ఎక్స్‌రే స్కానింగ్ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో మొబైల్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ శిబిరంలో ఛాతికి సంబంధిత, రక్త పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐ సంతోష్, డాక్టర్ ప్రదీప్, రవిప్రసాద్, జమాల్, అనిల్‌కుమార్, సైదులు, వెంకట్‌రెడ్డి, సయ్యదుద్దీన్, ఇనాయత్ అలీ, లెనిన్ పాల్గొన్నారు.

చేనేత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నల్లగొండ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చేనేత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సదర్భంగా సత్యం మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు లక్ష కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు. సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత రంగాన్ని గట్టు ఎక్కించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రకటించిన పథకాలను, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఆయన వెంట చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పానికంటి లక్ష్మీనర్సయ్య ఉన్నారు.

నీటి గణనను జాగ్రత్తగా నిర్వహించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): నీటి భద్రతను మెరుగుపరిచి, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి సహకరించే 7వ చిన్న తరహా నీటి వనరుల గణన, 2వ జలాశయాల గణన కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. 7వ చిన్న తరహా సాగు నీటి వనరుల గణన, 2వ జలాశయాల గణన కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ చాంబర్‌లో ముఖ్య ప్రణాళిక అధికారి, సంబంధిత అనుబంధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్న చిన్న తరహా ఇరిగేషన్ వనరులు, కుంటలు, ఆనకట్టలు, అలాగే ఉపరితల నీటి పథకాలను గుర్తించాలన్నారు. వాటి ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయాలన్నారు. జాతీయస్థాయిలో డేటా బేస్ అభివృద్ధి చేసే నిమిత్తం నీటి వనరుల గణన చేపట్టనున్నట్లు తెలిపారు. 1986 నుంచి ఇప్పటివరకు ఆరుసార్లు ఈ గణన చేపట్టనట్లు వివరించారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి 7వ గణన చేయాల్సి ఉందని తెలిపారు. జిల్లాలో ఉన్న చిన్నతరహా నీటిపారుదల పథకాలు, తుంపర్ల సేద్యం, బిందు సేద్యం, ఉపరితల జల పథకాలు, మధ్యతరహా గొట్టపు బావులు , ఉపరితల నీటి షెడ్యూల్ పథకాలను, నిలువ నీటి పథకాలను, చెరువులు, ఇతర పథకాలను లెక్కించడంతోపాటు, రెండో జలాశయాల గణనలో భాగంగా జలాశయాల గణన చేపట్టనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ప్రస్తుతం మైనర్ ఇరిగేషన్ వనరుల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. అందువల్ల వనరుల పునరుద్ధరణ, రైతులకు నీటి భద్రతతో పాటు, నీటి వాడకం సామర్థ్యం పెరిగితే వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి సీపీవో నల్లగొండ ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి, ఆర్డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ రామచంద్రారెడ్డి, ఎలక్ట్రిసిటీ అధికారులు అధికారులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ వ్యతిరేక కమిటీపై సమీక్ష

ఇటీవల ప్రభుత్వ వైద్య కళాశాలలో జరిగిన ర్యాగింగ్ సంఘటనలపై నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాల ర్యాగింగ్ వ్యతిరేక జిల్లాస్థాయి కమిటీ శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జె. సత్యనారాయణ, ఇన్‌చార్జి డీఆర్‌డీవో వై. అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల అదనపు ప్రిన్సిపాల్ ఆర్. రాధాకృష్ణ, సామాజిక కార్యకర్త సురేష్ గుప్తా, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా సమాజ సేవ

డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



జెండాను ఆవిష్కరించిన డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా సమాజ సేవ చేయాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని సహకార కేంద్ర బ్యాంకులో శుక్రవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఏడు రోజుల పాటు సహకార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, ఈ ఆర్థిక సంవత్సరం రూ.4వేల కోట్ల వ్యాపారంతో పాటు రూ.60కోట్ల లాభాలు సాధించేలా కృషిచేయాలన్నారు. నిధుల సమీకరణలో భాగంగా డిసెంబర్ నెలాఖరు వరకు రూ.100కోట్లు డిపాజిట్ సేకరించాలన్నారు. మహిళా సంఘాలకు అతి తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో శంకర్‌రావు, జీఎం నర్మద, పాశం డీసీసీబీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు తోడ్పాటుగా...

మునుగోడు: సహకార సంఘాల ద్వారా రైతులకు సకాలంలో పంట రుణాలతో పాటు ఎరువులు ఇతర వ్యవసాయ విత్తనాలు, పురుగు మందులను అందిస్తూ వారికి అండగా నిలవాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సహకార సంఘ వారోత్సవాలను పురస్కరించుకొని మునుగోడులో సహకార జెండాను ఎగురవేశారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు దుబ్బ గోపాల్, మేకల మల్లయ్య, సింగం వెంకన్న, కుతాటి బిక్షమయ్య, కృష్ణయ్య, మాదరబోయిన యాదయ్య, మార్త మోహన్‌రెడ్డి, నాయకులు భీమనపల్లి సైదులు, పాలకూరి నరిసింహగౌడ్, సహకార సంఘం కార్యదర్శి సుఖేందర్, అశోక్‌రెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

రూ.10కోట్లతో జిల్లా గ్రంథాలయ నిర్మాణం



జిల్లా గ్రంథాలయంలో మాట్లాడుతున్న చైర్మన్ హఫీజ్‌ఖాన్

నల్లగొండ కల్చరల్, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని టౌన్ హాల్ స్థలంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో రూ.10కోట్లతో జిల్లాకేంద్ర గ్రంథాలయ నూతన భవన నిర్మాణం చేపడతున్నామని గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఎ.హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించి ఆయన మాట్లాడారు. మంత్రి చొరవతో గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు సమకూ ర్చుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ కౌన్సిలర్లు ఇంతియాజ్, ఇబ్రాహిం, ఖలీల్, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. శ్రవణ్‌కుమార్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బషీరోద్దిన్, గ్రంథాలయ ఉద్యోగులు ఆర్. కుసుమశ్రీ, నిర్మలాదేవి, తారకేశ్వరి, రాజేష్, శ్రీనివాస్, నర్మదా, మల్లేష్, శారద, యామిని తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు కోసం ఉద్యమిస్తాం

బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మునాస ప్రసన్నకుమార్



అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న బీసీ జేఏసి నాయకులు

నల్లగొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని యథావిధిగా అమలు చేయడానికి డిసెంబరు నెలలో ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగాన్ని సవరించి బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు పెంచే వరకు రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని ఆపే ప్రసక్తేలేదన్నారు. తెలంగాణ ఉద్యమ తరహాలో పోరాటం చేసి సాధించుకుంటామన్నారు. కార్యక్రమంలో గండిచెరువు వెంకన్నగౌడ్, అయితగోని జనార్దన్‌గౌడ్, చిలకరాజు చెన్నయ్య, కృష్ణమూర్తి, పుట్ట వెంకన్నగౌడ్, కట్టికోలు దీపేందర్, సతీష్‌కుమార్, కర్నాటి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు
మహిళా కూలీ
- ఏసీబీ తనిఖీల్లో వెల్లడి
6

పీఆర్‌సీ, డీఏలను వెంటనే ప్రకటించాలి

నల్లగొండ, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ, పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని, లేని పక్షంలో ప్రత్యక్ష పోరాటం చేస్తామని తెలంగాణ రాష్ట్ర విశ్రాంతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్‌సీ గడువు ముగిసి రెండేళ్లయినా నేటికీ అమలు చేయకపోడంతో పెన్షనర్లు, ఉద్యోగులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెన్షనర్ల డిమాండ్లు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి, నాయకులు జె.శ్రీశైలం, గాయం నారాయణరెడ్డి, రంగయ్య, మెహన్‌రావు, యుగేంధర్, ఆంజనేయులు, కృష్ణయ్య, సంతోష్‌రెడ్డి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి

రైతులకు మద్దతు ధర అందించాలి

రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న సీపీఎం నేత బండ శ్రీశైలం

చండూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు మద్దతు ధర అందజేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు ధాన్యం తీసుకువచ్చి రోజులు గడుస్తున్నా నేటికీ కొనుగోలు చేయడం లేదన్నారు. రైస్ మిల్లుల కేటాయింపు కూడా నేటికీ పూర్తికాకపోవడం దారుణమన్నారు. రైతులు నేరుగా మిల్లులకు ధాన్యం తీసుకెళ్తే క్వింటాకు రూ.1,600 నుంచి రూ.1,800 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొండాపురంలో రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చి వారం రోజులైనా అతీగతీ లేదని వాపోయారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, నాయకులు బాలెం స్వామి, రూప లింగయ్య, సత్తయ్య, లింగాస్వామి, అచ్చమ్మ, భాగ్యమ్మ, పాల్గొన్నారు.

బియ్యం ఇస్తున్నా.. సంచులు ఇస్తలేరు!

(5వ పేజీ తరువాయి)



లబ్ధిదారులు సంచి విషయంలో డీలర్లతో గొడవపడుతున్నారు. ప్రతి నెలా బియ్యం తీసుకుంటున్నా సంచి ఎందుకు ఇవ్వవడంలేదని గట్టిగా ప్రశ్నిస్తున్నారు. అయితే లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా సంచులు రేషన్ దుకాణాలకు ప్రభుత్వం సరఫరా చేసిందని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి బియ్యం అయితే ఇస్తాంగానీ, సంచులు కేటాయించలేమని రేషన్ డీలర్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంచులను లబ్ధిదారులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నేతలు కోరుతున్నారు.

ఎంతమంది ఉన్నా.. ఒక్కటే సంచి

రేషన్‌కార్డుదారుడి కుటుంబంలో ఎంత మంది ఉన్నా ఒక్కటే సంచి అందిస్తున్నారు. 6కిలోల ప్యాకేజీ ప్రకారం కుటుంబానికి సంచులు పంచాల్సి ఉండగా, అందుకు భిన్నంగా కుటుంబమంతటికీ కలిపి ఒకే ఒక సంచి ఇస్తున్నారు. ప్రభుత్వం సదుద్దేశంతో ప్రవేశపెట్టిన సంచు ల పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ప్రత్యేకంగా తయా రు చేసిన సంచులను విరివిగా పంచితేనే ప్లాస్టిక్ వినియోగం కొంతమేరకైనా తగ్గుతుందంటున్నారు లబ్ధిదారులు.

జిల్లాకు 4.65లక్షల సంచులు

జిల్లాలో 997 రేషన్ దుకాణాలు ఉండగా, ఇటీవల జారీ చేసిన నూతన కార్డులతో కలిపి 5,31,828 రేషన్‌కార్డులున్నాయి. కార్డుల్లో నమోదైన సభ్యుల వివరాలకు అనుగుణంగా 9,500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు. కార్డులో నమోదైన ఒక్కో లబ్ధిదారుడికి 6 కిలోల చొప్పున బియ్యం కేటాయింపు జరగ్గా, అదే ప్రాతిపదికన ఒక్కో లబ్ధిదారుడికి ఒక సంచి అందించాల్సి ఉంది. అయితే జిల్లాకు 4.65లక్షల సంచులు సరఫరా అయినట్లు సమాచారం.

ప్రచారం కోసమే సంచులు



సంచుల పంపిణీ విషయంలో ప్రభుత్వ ఆలోచనేంటో అర్థం కావడం లేదు. ఎందుకు ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు? అమలుచేస్తున్న వారు లబ్ధిదారులకు సరిపడా సంచులు అందజేయాలి. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలనుకోవడం మంచి నిర్ణయమే. 6కిలోలు నింపిన సంచులను అందిస్తే ఉపయోకరంగా ఉండేది. సంచుల సరఫరా అధికార పార్టీ ప్రచారం కోసమే తప్ప మరెందుకు కాదు.

- డబ్బీకార్ మల్లేష్, సీపీఎం నాయకుడు, మిర్యాలగూడ

బియ్యం ఎక్కడ తీసుకుంటే అక్కడ అందజేయాలి



రేషన్ బియ్యం పంపిణీని పర్యావరణ హితమైన సంచుల ద్వారా చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం మంచిదే. అయితే కోటా బియ్యాన్ని తీసుకున్న చోటే లబ్ధిదారులకు సంచులు అందజేయాలి. బియ్యం ఒక చోట, సంచి మరోచోట తీసుకోమనడం సరి కాదు. ప్రభుత్వ విధానంతో అటు రేషన్ డీలర్లు, ఇటు లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. బియ్యం అందిస్తున్న తరహాలోనే సంచులకూ పోర్టబులిటీ విధానం అమలు చేయాలి.

- చావల వెంకటేశ్వర్లు, టీడీపీ సీనియర్ నేత, మిర్యాలగూడ

సర్కార్ దవాఖానాలో ఆ ఇద్దరు!

(5వపేజీ తరువాయి)

అధికారులు, ఉద్యోగుల్లో ఏమాత్రం మార్పు కన్పించడం లేదు. చిరు ఉద్యోగులైన అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వచ్చేదే చాలీచాలని వేతనమైనా కమీషన్ ఇవ్వాల్సి వస్తోంది. విషయాన్ని బయటికి చెబితే ఎక్కడ ఉద్యోగం నుంచి తొలగిస్తారోననే ఆందోళనతో వేతనాల్లో కోతపెడుతున్నా మిన్నకుండిపోతున్నారు.

ముడుపులు ఇస్తేనే కదులుతున్న ఫైళ్లు

ముడుపులు ఇస్తేనే జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలోని అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఫైళ్లు కదులుతున్నాయనే చర్చ సాగుతోంది. ప్రభుత్వం నుంచి బడ్జెట్ కేటాయింపులు ఆలస్యమవుతున్న నేపథ్యంలో తెచ్చిన అప్పులకు వడ్డీలకే సరిపోతోందని, బిల్లుల కోసం సంబంధిత సెక్షన్‌లో ముడుపులు ఇస్తేనే ఫైల్ కదులుతోందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. శానిటేషన్, అవుట్‌సోర్సింగ్, డైట్, డ్రగ్స్ సర్జికల్, ఇంప్లాంట్స్ బిల్లుల చెల్లింపుల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. గతంలో బిల్లుల చెల్లింపు ఫైల్‌పై సంతకం కోసం ముడుపులు తీసుకుంటూ ఓ ఉన్నతాధికారి ఏసీబీకి పట్టుబడినా సంబంధింత అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో మార్పు రాకపోవడం గమనార్హం. ఈ సెక్షన్‌లో ఇద్దరు ఉద్యోగులు అవినీతిపై ఇటీవల రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీకి, మెడికల్ హెల్త్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీకి, జిల్లా ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. వీరిపై గతంలో కూడా అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కాంట్రాక్ట్ ఇప్పిస్తామంటూ లక్షల రూపాయలు వసూలు చేసినట్లు సంబంధిత సెక్షన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ముడుపులు ఇవ్వని ఉద్యోగులతో పాటు కాంట్రాక్టర్లకు చెందిన ఫైళ్లను రోజులు, నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నట్టు తెలిసింది.

శాఖపర చర్యలు ఉండేనా?

ఉన్నతాధికారుల సమీపంలో ఉండే ప్రభుత్వ ఆస్పత్రి కార్యాలయంలో అక్రమాలు జరుగుతుండగా, వాటిపై దృష్టిసారించి శాఖపర చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు ఉండటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ ఫైళ్లు పెండింగ్‌లో ఉంటే కింది స్థాయి అధికారులను, ఉద్యోగులను ప్రశ్నిస్తే పెండింగ్ వెనుక తతంగం బయట పడే వీలుంటుంది. సరైన సమయంలో ఇంప్లాంట్స్‌తో పాటు మందులు, శానిటేషన్ వస్తువులు సరఫరా కావాలంటే ఫైల్‌ను త్వరితగతిన పరిష్కరించాలి. అయితే సంబంధిత అడ్మిన్‌స్ట్రేషన్ విభాగంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు లేదా ఫైల్‌ను తొక్కిపెట్టి ముడుపులు అందాక క్లియర్ చేస్తున్నారు. దీంతో పలు విభాగాల్లోని రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అలాంటిదేమీ లేదు

అడ్మిన్‌స్ట్రేషన్ విభాగంలో ఎలాంటి అక్రమాలు లేవు. ఎప్పటికప్పుడు పరిపాలనా విభాగం కార్యాలయంలో పర్యవేక్షణ చేస్తుంటాం. శానిటేషన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించి బడ్జెట్ రావాల్సి ఉంది. డబ్బు ఇస్తేనే ఫైల్ కదలిస్తున్నారనే ఫిర్యాదులు రాలేదు. డబ్బు తీసుకొని పనులు చేస్తున్నారనేది వాస్తవం కాదు. ఈ విషయంలో ఏవైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం.

- అరుణ కుమారి, సూపరింటెండెంట్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

చంద్రమౌళి, ఎంపీడీవో, పీఏపల్లి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పెద్ద అడిశర్లపల్లి ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. అలాగే ఇతర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నామని 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో చెప్పారు.

(పీఏపల్లి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతున్నాయా?

ఎంపీడీవో: ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అర్హులైన ప్రతీ ఒక్కరికీ పథకాలు అందుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఎలా సాగుతున్నాయి?

ఎంపీడీవో: ఇళ్ల నిర్మాణాలు వేగంగా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించాం. బేస్‌మెంట్ లెవల్ నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు చెల్లింపులు చేస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్లపై నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామ కార్యదర్శుల పనితీరుపై విమర్శలు వస్తున్నాయి?

ఎంపీడీవో: మండలంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులను నిత్యం పర్యవేక్షిస్తుంటాను. మండలంలో చాలా కార్యదర్శుల పోస్టులు ఖాళీ అవుతున్నాయి. పక్క గ్రామాల కార్యదర్శులను ఇన్‌చార్జీలుగా కేటాయించాం.

ఆంధ్రజ్యోతి: మిషన్ భగీరథ నీరు సరిగా అందుతున్నాయా?

ఎంపీడీవో: గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై పర్యవేక్షణ చేస్తున్నాం. సమస్య ఉన్న గ్రామాలను పరిశీలించి తగినచర్యలు తీసుకుంటున్నాం. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడుతూ గ్రామ కార్యదర్శులతో సమస్య పరిష్కరిస్తున్నాం.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి

హాలియా, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు రిక్కల మధుసూదన్‌రెడ్డి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అనుముల మండలంలోని ఇబ్రహీంపేట, రామడుగు, అనుముల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణ, సెక్రటరీ రావుల సత్యం, డైరెక్టర్లు నర్సింహారెడ్డి, వెంకటయ్య, సైదులు, ఏఈవో కల్యాణ్ పాల్గొన్నారు.

వారాంతపు, పండుగ సెలవులు ఇవ్వాలి

హాలియా, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులకు వారాంతపు, పండుగ సెలవులు ఇవ్వాలని మునిసిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ సలీం డిమాండ్ చేశారు. మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్మికులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, నాయకులు అన్నెపాక శ్రీను, వెంకటయ్య, శంకర్, రజిత, కాశమ్మ, సైదమ్మ, రమణ, నర్సమ్మ, చందు, ఈదయ్య పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం ఉద్యమించాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నపాక లక్ష్మీనారాయణ

గుర్రంపోడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వంపై సమరశీల ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ అన్నారు. గుర్రంపోడు మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం ఐక్యంగా సమరశీల ఉద్యమాలకు సిద్ధంకావాలన్నారు. ఈనెల 26 కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త నిరసన జయప్రదం చేయాలని కోరారు. నల్లగొండలో ఈనెల 29, 30 తేదీల్లో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సీఐటీయూ మండల కన్వీనర్‌గా పగిడిమర్రి సర్వయ్యను ప్రకటించారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు వనమాల కామేశ్వర్, నీల ఆంజనేయులు, వెంకటయ్య, ఎ.నరేష్, దుర్గ, విజయ, సైదులు, నాగయ్య పాల్గొన్నారు.

పత్తి రైతులు స్లాట్ బుక్ చేసుకోవాలి

మిర్యాలగూడ అర్బన్: పత్తి అమ్మకానికి సిద్ధంగా ఉన్న రైతులు సమీప రైతువేదికలో వ్యవసాయాధికారులను సంప్రదించి కిసాన్ కాపాస్ యాప్‌లో స్లాట్ బుక్ చేయించుకోవాలని మిర్యాలగూడ ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మీ కోరారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఏఈవోలు, ఏవోలు, క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పత్తి రైతులను కలిసి కపాస్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేయటం గురించి వివరిస్తారని పేర్కొన్నారు. శని, ఆదివారాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. సీసీఐ కేంద్రాలలోనే పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. చింతపల్లి ఏవో శ్రావణకుమారి మాట్లాడుతూ స్లాట్ బుక్ చేయడానికి ఏఈవోలకు రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఫోన్ నంబర్లను ఇవ్వాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దఅడిశర్లపల్లి: మండల పరిధిలోని 33/11 కేవీ పుట్టంగండి, అజ్మాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ దేవోజీనాయక్ తెలిపారు. పుట్టంగండి, అజ్మాపురానికి వచ్చే 33/11 కేవీ విద్యుత్ లైన్లకు హెవీ స్విచ్ బిగించడం కారణంగా అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు పామాయిల్ సాగుపై అవగాహన

డిండి: డిండి మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో శనివారం పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డిండి సొసైటీ సీఈవో వంగాల బాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పామాయిల్ పంటల సాగుపై ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం రాయితీ, బీసీ రైతులకు 90శాతం రాయితీ, ఇతరులకు 80శాతం సబ్సిడీ ఉందని తెలిపారు. ఆసక్తిగల రైతులు ఉదయం 10 గంటలకు జరిగే అవగాహన సదస్సుకు హాజరుకావాలని కోరారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

డిండి: డిండి మండల కేంద్రంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు పీఏసీఎస్ సీఈవో వంగాల బాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిండి మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో ఉదయం 9 గంటలకు ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

రైతులను ఇబ్బందులు పెడితే కఠిన చర్యలు

మాడ్గులపల్లి: కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యానికి ఎప్పటికప్పుడు కాంటాలు నిర్వహించి రైతులకు డబ్బులు చెల్లించేలా అధికారులు పనిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ సరోజ, పావని ఉన్నారు.

గుర్రంపోడు: గుర్రంపోడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలో ఉన్న ధాన్యం రాశులు, రిజిస్టర్లు, ట్రాక్‌షీట్లను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి



దేవరకొండలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

దేవరకొండ, చింతపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో డిసెంబరు 26న నిర్వహించే సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, మునుగోడు మాజీఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. శుక్రవారం దేవరకొండ, చింతపల్లిలో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. ప్రజా సమస్యలపై సీపీఐ వందేళ్ల ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు గద్వాల నుంచి కొత్తగూడెం వరకు ప్రచారజాత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ, ఎమ్మెల్సీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లికంటి సత్యం నాయకత్వంలో నిర్వహించే ప్రచారజాతను విజయవంతం చేయాలని వారు కోరారు. దేవరకొండలో నిర్వహించిన సమావేశంలో సీపీఐ మండల నాయకులు నూనె రామస్వామి, దేప సుదర్శన్‌రెడ్డి, పల్లా రంగారెడ్డి, వలమాల ఆంజనేయులు, జూలూరి వెంకట్రాములు, యాదయ్య, చింతపల్లిలో నిర్వహించిన సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, నాయకులు చేపూరి వెంకటయ్య, ఉజ్జిని అంజల్‌రావు, వేముల బుచ్చయ్య, పల్లపు లక్ష్మయ్య, షేక్.శంషుద్దీన్, ఇద్ది రాములు, నరసింహ, రాములు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సాగర్ జలాశయంలో చేప పిల్లల విడుదల

● 27 లక్షల చేప పిల్లలు వదలనున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ జలాశయంలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన చేప పిల్లలను నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి శనివారం ఉదయం 11 గంటలకు వదలనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం.రాజారాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.40.86లక్షల విలువైన 27లక్షల చేప పిల్లలను 15, 16, 17 తేదీల్లో మూడు రోజుల పాటు నదిలో వదలనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, కమిటీ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

డిండి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తవక్లాపూర్ నుంచి నగరదుబ్బతండాకు వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఏఐవైఎఫ్ నాయకులు యనమల్ల నవీన్, సురిగి వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీవో వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తవక్లాపూర్, నగరదుబ్బతండా రోడ్డును బీటీ రోడ్డుగా ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో నాయకులు ఎలిమినేటి నరేష్, రమేష్, సాయిచరణ్, ప్రమోద్, సిద్దార్థ్, అనిల్, తేజసాగర్, శివ, వంశీ ఉన్నారు.

నివాసాల మధ్య వైన్స్‌షాపును తొలగించాలి

దేవరకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని శ్రీసాయినగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వైన్‌షాపు, పర్మిట్ రూంను తొలగించాలని బీసీ రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్, ఎక్సైజ్ ఎస్ఐలకు వేర్వేరు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సాయినగర్ కాలనీలో మద్యం దుకాణం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పర్మిట్‌రూం ఏర్పాటును రద్దు చేయాలన్నారు. పక్కనే బ్యాంకుతో పాటు గృహ నివాసాలు ఉన్నాయని అన్నారు. అధికారులు స్పందించి మరో చోటుకు మార్చాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో బీసీ సంఘం నేతలు పున్న వెంకటేష్, వరికుప్పల శ్రీను, కోటేశ్వర్‌రావు, భాషనాయక్, యాదయ్య, సుధాకర్ ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

నేరేడుగొమ్ము, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ పంట సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఏవో వాసిమొద్దీన్, ప్లాంటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ చింతకుంట్ల రాజు అన్నారు. తిమ్మాపురం పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పేర్వాల గ్రామంలో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఇతర పంటలతో పోల్చుకుంటే ఆయిల్‌పామ్ సాగు ఖర్చు కూడా చాలా తక్కువ అని అన్నారు. ఆయిల్‌పామ్ పంటలో నాలుగేళ్ల వరకు అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలంయాదవ్, రైతులు పాల్గొన్నారు.

గాయపడిన కూలీలను ఆదుకోవాలి

దేవరకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి వద్ద ఆటో బోల్తాపడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన పత్తి కూలీలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంభాలపల్లి ఆనంద్ డిమాండ్ చేశారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పీఏపల్లి మండలం పెద్దగుమ్మడం గ్రామానికి చెందిన కూలీలను శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేసి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గాయపడిన కూలీలకు మెరుగైన వైద్యం అందించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట వ్యకాస నాయకులు వెంకటయ్య, దస్రు, బోడయ్య తదితరులు ఉన్నారు.

'జూబ్లీహిల్స్' గెలుపు ప్రజాపాలన విజయం : బాలునాయక్



దేవరకొండలో సంబురాలు చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

దేవరకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నిక గెలుపు ప్రజాపాలన విజయమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ భారీ మెజార్టీ గెలుపునకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలే కారణమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి విక్రమార్కతో పాటు మంత్రులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేసినట్లు ఆయన తెలిపారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో దేవరకొండ, కొండమల్లేపల్లి, నాగార్జునసాగర్ నియోజకవరాల్లో కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం రాత్రి టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే జూబ్లీహిల్స్ ఎన్నికలో గెలుపునకు కారణమన్నారు. ఆయా కార్యక్రమాల్లో దేవరకొండ మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నాయకులు ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, పున్న వెంకటేశ్వర్లు, శిరందాసు కృష్ణయ్య, శ్రీశైలంయాదవ్, నిరంజన్, పొన్నబోయిన సైదులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : బీఎల్ఆర్



గిరిజన గురుకుల బాలికలతో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

దామరచర్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలికల సర్వతోముఖాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల విద్యాలయాన్ని శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా ఆయన సందర్శించారు. మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి విద్యార్థినులకు మిఠాయిలు పంపిణీ చేసి మాట్లాడారు. నేటి బాలలే రేపటి బావిభారత పౌరులని ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దానిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ ద్వారా మంజూరైన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక సౌకర్యాలు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం వంటగది, స్టాక్ రూంలను పరిశీలించి బాలికలతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అలివేలుమంగమ్మ, ఎంఈవో బాలాజీ నాయక్, ప్రిన్సిపాల్ కవిత, ప్రత్యేక అధికారి కవిత ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని విద్యాలయాల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బకాల్‌వాడీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గాంధీపార్కు ప్రాథమికోన్నత, ఆదిత్య ఉన్నత పాఠశాల, అబ్యాస్, శివాని, ఎస్వీ తదితర పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాలకు చిన్నారులు ఉత్సాహంగా హాజరయ్యారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో బకాల్‌వాడీ హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, సైదులు, వెంకయ్య, అమరేందర్‌రెడ్డి, పుష్పలత, శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సీతారాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో షబానా, షాహిన్, రాధాబాయి పాల్గొన్నారు.

హాలియా: బాలలు క్రమశిక్షణతోనే ఉన్నత లక్ష్యాన్ని సాధించవచ్చని పులిమామిడి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శైలజ అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహాచారి, రవీంద్రాచారి, కొల్లు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, సంధ్య, ఉమారెడ్డి, వినోద, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

● అనుముల మండలం, హాలియా మున్సిపాలిటీలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాలియా జడ్పీ హైస్కూల్‌లో ఎంఈవో గుండా కృష్ణమూర్తి, ఎమ్మార్సీలో వెంకట్‌రాంరెడ్డి, చల్మారెడ్డిగూడెంలో ప్రకాష్, హెచ్‌ఎం లక్ష్మి, ప్రైవేట్ పాఠశాలలో ఆయా పాఠశాలల చైర్మన్లు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు కుంచం హరివర్ధన్, సీఆర్‌పీ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: మండలకేంద్రంలోని శ్రీసాయి కృష్ణవేణి పాఠశాలలో బాలబాలికలు ఉయ్ లవ్ చాచా ఆకారంలో కూర్చొని చేపట్టిన ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్రారెడ్డి, టీచర్లు సైదిబాబు, వెంకట్, మహేష్, ప్రేమ్, కుర్షీద్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బంగారిగడ్డ హైస్కూల్ విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో లావూరి బాలు, ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మునీర్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాలాజీనాయక్, అహ్మద్, వీరనారాయణ, యాదగిరి, ఎల్లమ్మ, రజని, శ్రీనివాస్, పాల్గొన్నారు.



పులిమామిడి పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం శైలజ

తిరుమలగిరి(సాగర్): మండలంలోని రంగుండ్లతండాలో మండల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పలు వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్.భాస్కర్‌రెడ్డి, టీచర్లు ప్రభాకర్‌రెడ్డి, రాజేష్, విజిత, రజిత, చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణంలో దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ సంఘం అధ్యక్షుడు ఎన్‌వీటీ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ నాయకులు శ్రీధర్‌గౌడ్, కృష్ణకిశోర్, పంతులాల్, నిరంజన్, భాస్కర్‌రెడ్డి, సురేష్, రాజ్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.ఆనందరెడ్డి, ప్రిన్సిపాల్ పర్వీన్‌సుల్తానా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ఇండియా ప్రాజెక్టు వ్యవస్థాపకుడు, ఎన్‌ఆర్‌ఐ చాంద్‌పాష అన్నారు. నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలో మోడల్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం వివిధ తరగతుల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు గోల్డెన్ స్టార్ అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం సెక్రటరీ రామదాసు, హెచ్‌ఎం శేషు, బిగ్ హెల్ప్ పీడీ రాజబాబు, ఏడీ అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.